J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 12 22.8.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • తెలియకనా.. తెగువ లేకనా..

# అధినాయకా.. నువ్వు మారవా?



### జగన్ తీరుపై.. వైసీపీ శ్రేణుల అంతర్మథనం

- గత ఎన్నికల్లో అక్రమాలు జరిగుంటే... ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నట్లు?
- నిలదీయాల్సిన బాధ్యత మనకి లేదా?
- ప్రతిపక్షంలో ఉన్న రాహుల్‌తో మనకి అవసరమా?
- మారకుంటే మొదటికే మోసం!

పట్టుదల, తెగువ ఉంటే ఎంతటి విపత్కర పరిస్థితులనుంచైనా బయటపడొచ్చు. ఎదురుదెబ్బలకు డీలాపడితే భవిష్యత్ అగమ్య గోచరమే. ముఖ్యంగా రాజకీయనాయకుల విషయంలో ఇది అక్షర సత్యం. ఎందుకంటే నాయకుడెప్పుడూ ఓ వ్యక్తికాదు, ఓ వ్యవస్థ. తనపై ఆధారపడి, తననే నమ్ముకున్న కేడర్ తన వెంట ఉండాలంటే ఎప్పుడూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత నాయకుడిదే.

ఎందుకో ఈ అంశాన్ని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్మరించినట్లే కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఏకంగా 151సీట్ల నుంచి 11సీట్లకి పడిపోవడంతో ఆయన ఇక రాష్ట్రంలో పని లేదన్నట్లుగా, బెంగళూరుకే పరిమితమైపోతున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి సమయంలో

2లో



## • విడుదలైన కాకాణి

# బెయిలుపై బయటకి!

12లో..





## • కిలాడి లేడీకి పోలీసు బేడీలు

# అరుణ అరెస్టు



3లో..





## • భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక

# ఫలితం తెలిసినా.. ప్రాధాన్యత తగ్గని పోరు!



***2024 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ సమీకరణాలకు భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక తొలి పరీక్షగా నిలుస్తోంది. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) అభ్యర్థి విజయం సంఖ్యాపరంగా లాంఛనమే అయినప్పటికీ, ఈ పోరు అధికార, విపక్ష కూటముల మధ్య కొత్త బల సమీకరణలకు, వ్యూహాత్మక చతురతకు అద్దం పడుతోంది.***

అధికార ఎన్డీయే కూటమి తమ అభ్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సి.పి. రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపగా, విపక్ష 'ఇండియా' కూటమి ఉమ్మడి అభ్యర్థిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసింది. ఈ అభ్యర్థుల ఎంపిక కేవలం ఓట్ల లెక్కింపుగా కాకుండా, భవిష్యత్ రాజకీయాలకు ఒక సూచికగా నిలుస్తోంది.

ఉపరాష్ట్రపతిని ఉభయ సభల (లోక్‌సభ, రాజ్యసభ) సభ్యులు ఎన్నుకుంటారు. మొత్తం 781 మంది ఎంపీల ఎలక్టోరల్ కాలేజీలో గెలుపునకు 391 ఓట్లు అవసరం. ఎన్డీయే కూటమికి లోక్‌సభలో 293, రాజ్యసభలో 132 మంది సభ్యులతో కలిపి మొత్తం 425 ఓట్ల స్పష్టమైన ఆధిక్యం ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ(వైసీపీ) తమ 7మంది ఎంపీల మద్దతును ప్రకటించడంతో ఎన్డీయే బలం 432కు చేరింది. మరోవైపు, ఇండియా కూటమి బలం 311 ఓట్లు మాత్రమే. ఈ అంకెలతో సి.పి. రాధాకృష్ణన్ విజయం ఖాయమని స్పష్టమవుతోంది.

ఓటమి ఖాయమని తెలిసినా, ఇండియా కూటమి పోటీకి దిగడం ఒక వ్యూహాత్మక ఎత్తుగడ. ఏకగ్రీవ ఎన్నికకు అవకాశం ఇచ్చి, ప్రభుత్వానికి నైతిక విజయం కట్టబెట్టకుండా, తమ ఐక్యతను చాటుతూ సైద్ధాంతిక పోరాటానికి తెరలేపాలని విపక్షం భావిస్తోంది. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న అభ్యర్థికి జేడీయూ, టీడీపీ వంటి లౌకికవాద పార్టీలు మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితిని కల్పించడం ద్వారా, వాటిని ఇరకాటంలో పెట్టడం కూడా ఇందులో భాగమే. ఈ ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీకాదు, రెండు విభిన్న తాత్విక భూమికల మధ్య ఘర్షణ. ఎన్డీఏ అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్ తన 17వ ఏటనే ఆరెస్సెస్, జనసంఘ్‌తో ప్రజాజీవితాన్ని ప్రారంభించి, నాలుగు దశాబ్దాలుగా బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడిన రాజకీయ యోధుడు. రెండుసార్లు ఎంపీగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా, గవర్నర్‌గా అపార అనుభవం గడించారు. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం ద్వారా, దక్షిణ భారతదేశంలో విస్తరించాలనే బీజేపీ ఆకాంక్ష కనిపిస్తోంది.

ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి రాజకీయాలకు దూరంగా న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయికి ఎదిగిన న్యాయకోవిదుడు. సల్వాజుడుం వంటి కేసులలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఆయన ఇచ్చిన తీర్పులు ప్రసిద్ధి. ఆయన అభ్యర్థిత్వం ద్వారా ఈ ఎన్నికను రాజ్యాంగ పరిరక్షణ కోసం చేస్తున్న సైద్ధాంతిక పోరాటంగా మలచాలని విపక్షం ప్రయత్నిస్తోంది.

ఈ ఎన్నిక దక్షిణ భారతదేశాన్ని కేంద్రంగా చేసుకుని సాగుతున్న రాజకీయ చదరంగంలా మారింది. ఎన్డీయే, సి.పి. రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసి "తమిళ ఆత్మ గౌరవం" అనే అస్త్రాన్ని ప్రయోగించి, ఇండియా కూటమిలోని డీఎంకేను ఇరకాటంలో పెట్టాలని చూసింది. దీనికి ప్రతిగా ఇండియా కూటమి తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేసి, ఎన్డీయే వ్యూహాన్ని తిప్పికొట్టింది. ఇది ఎన్డీయేలోని తెలుగుదేశం పార్టీని(టీడీపీ) ఇబ్బందికరమైన స్థితిలోకి నెట్టింది. ఒక తెలుగు వ్యక్తికి వ్యతిరేకంగా ఓటు వేయాల్సిన పరిస్థితి టీడీపీకి రాజకీయంగా సవాలుగా మారింది.

ఈ ఎన్నిక ఇద్దరు తటస్థుల వైఖరిలో మార్పును స్పష్టం చేసింది. వైసీపీ ఎప్పటిలాగే ఎన్డీయేకు మద్దతు పలికింది. అయితే, అత్యంత కీలకమైన మలుపు బిజూ జనతా దళ్ (బీజేడీ) వైఖరి. ఎన్డీయే అభ్యర్థికి మద్దతు ఇవ్వకూడదని బీజేడీ నిర్ణయించుకుంది. ఒడిశా ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓటమి తర్వాత, ఆ పార్టీ జాతీయ స్థాయిలో స్పష్టమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ఇది రాజ్యసభలో ప్రభుత్వానికి కీలకంగా మారవచ్చు.

ఈ ఎన్నికల ఫలితం ముందుగానే తెలిసినా, దాని ప్రాముఖ్యత గెలుపోటములకు అతీతమైంది. రాధాకృష్ణన్ విజయంతో, బలమైన సైద్ధాంతిక నేపథ్యం ఉన్న వ్యక్తి రాజ్యసభకు అధ్యక్షత వహించబోతున్నారు. ఈ ఎన్నిక ఒక ముగింపు కాదు, రాబోయే ఐదేళ్లలో దేశ పాలనను నిర్దేశించబోయే రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలకు ఒక కొత్త ఆరంభం.

**- నవీన్**
**సీనియర్ జర్నలిస్టు, రాజమహేంద్రవరం**

# అధినాయకా.. నువ్వు మారవా?

(మొదటిపేజీ తరువాయి)

ఏ నాయకుడైనా కార్యకర్తలు జవసత్వాలు కోల్పోకుండా తక్షణ చర్యలు చేపడతాడు. కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం ప్రెస్‌మీట్లకీ, ట్వీట్లకి, జైళ్ళ యాత్రలకి పరిమితమౌతూ, తన అస్త్ర సన్యాసాన్ని బహిరంగంగా ప్రకటించుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

## కేంద్రాన్ని వదిలి ప్రతిపక్షాన్ని టార్గెట్ చేస్తే ఏం లాభం!

దేశవ్యాప్తంగా ఓట్ చోరీపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన ఇండియా కూటమి పక్షాలతో కలిసి ఢిల్లీలో అలుపెరగని పోరు సాగిస్తున్నారు. బిహార్ ఎన్నికల్లో ఈసీ ఏకపక్షంగా 65లక్షల ఓట్లు తొలగించిందంటూ కొన్ని సాక్ష్యాలను కూడా ఆయన సుప్రీంకోర్టు ముందుకు తీసుకొచ్చారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంతో కలిసి ఎన్నికల కమిషన్ అక్రమాలకు పాల్పడుతోందని, బీజేపీకి ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు. గత హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఇది బహిర్గతమైందంటూ విరుచుకుపడుతున్నారు. కర్ణాటకలోనూ లెక్కకుమిక్కిలి అక్రమాలకు పాల్పడుతూ మోడీ, అమిషా ద్వయానికి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఊడిగం చేస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రతిపక్ష ఇండియా కూటమిని విమర్శించడం, ప్రధానంగా ఎన్డీయేపై పోరాడుతున్న కాంగ్రెస్‌ను టార్గెట్ చేయడం జగన్ అమాయకత్వానికి నిదర్శంగా కనిపిస్తోందని విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఇసుక, మద్యం కుంభకోణంలో కొందరు వైసీపీ నాయకులు, గత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు వెలగబెట్టిన కొందరు అధికారులు పీకల్లోతు కూరుకుపోయి బయటపడేందుకు అపసోపాలు పడుతున్నారు. ఈ కేసులో ఏకంగా జగన్‌ను కూడా అరెస్టు చేస్తారంటూ ప్రచారం సాగుతోంది. ఇలాంటి సమయంలో ప్రతిపక్ష ఇండియా కూటమిని లీడ్ చేస్తున్న కాంగ్రెస్‌ను విమర్శించడమంటే, తనకున్న ఒక్క అవకాశాన్ని జగన్ పోగొట్టుకున్నట్లే లెక్క అన్నది వారి భావన. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతూ తమ నాయకులను వేధిస్తోందని తరచూ ఆరోపించే జగన్, ఈ విషయాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకెళ్లాలంటే కచ్చితంగా కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న ఇండియా కూటమి మద్దతు అవసరం. అలాంటిది వారినే టార్గెట్ చేస్తే కూటమిలో కీలకంగా ఉన్న అఖిలేష్‌యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ కానీ, మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్‌పార్టీ కానీ, స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే నాయకులు కానీ వైసీపీ నాయకులను కలిసేందుకు మొగ్గుచూపుతారా..? కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడంలో సాయం అందిస్తారా..? చాన్సే లేదు కదా..! మరి ప్రతిపక్ష కూటమిలో ఉండే పార్టీలే వైసీపీని పట్టించుకోకుంటే, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనలతో కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్న బీజేపీకి సంబంధించిన అగ్రనాయకులు, కేంద్రమంత్రులు, వైసీపీ అధినేతకు అపాయింట్‌మెంట్ ఇస్తారా..? ఈ మాత్రం లాజిక్ కూడా తెలియకుండా జగన్ ఏం రాజకీయాలు చేస్తున్నారంటూ కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులే వాపోతుతండడం గమనార్హం.

## ఒక్కశాతం కూడా ఓట్ షేర్‌లేని పార్టీ పోరాడాలా..?

2024 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అక్రమాలు జరిగింది వాస్తవమే అయితే... ఢిల్లీ నుంచి వచ్చి రాహుల్‌గాంధీ పోరాడాలా..? మరి వైఎస్సార్‌సీపీ ఇక్కడ ఎందుకున్నట్లు..? రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో నామరూపాల్లేకుండా పోయిన పార్టీ కాంగ్రెస్. అలాంటి పార్టీ తన కోసం వచ్చి పోరాడాలన్నట్లు వైఎస్ జగన్ మాట్లాడడం విడ్డూరమే. ఎందుకంటే శత్రువు బలంగా ఉన్న సమయంలో గడ్డిపరక సహాయమైనా, ఉడత సహాయమైనా గొప్ప విషయంగానే భావించి వీలైనంతగా అందరినీ కలుపుకుని



పోరాడడం నాయకుడి లక్షణం. అలాంటిది శత్రువుపై పోరాడుతున్న వారినే బలహీన పరిచేలా మాట్లాడడం, విమర్శించడం అవివేకం. ఇక జగన్ ఆరోపించినట్లు బీజేపీతో చెట్టాపట్టాలేసుకుని, కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్న చంద్రబాబే కాంగ్రెస్ అధిష్టానంతో టచ్‌లో ఉంటే, ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ నా అనేవారు లేకుండా అల్లాడిపోతున్న జగన్ ఇంకెంత జాగ్రత్తగా ఉండాలి. ఇంకెంత కలుపుగోలుగా మాట్లాడాలి అన్నది రాజకీయ విమర్శకుల అభిప్రాయం.

## నిజంగా అక్రమాలు జరిగుంటే ఎందుకు పోరాడలేదు...?

వైఎస్ జగన్ ఆరోపిస్తున్నట్లు గత ఎన్నికల్లో పోలింగ్ కంటే 48 లక్షల ఓట్లను అధికంగా ఈసీ లెక్కించి ఉంటే, ఆ విషయాన్ని నిరూపించేందుకు ఆయన క్షేత్రస్థాయిలో ఎందుకు పోరాడడం లేదు. ఎందుకు ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించలేదు. ఎందుకు కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించలేదు. బీజేపీ అంటే భయమా..? లేక తన అక్రమాస్తుల కేసుల్లో సీబీఐ, ఈడీ జోరుపెంచుతాయనే ఆందోళనా..? ఆంధ్రప్రదేశ్‌లో మొన్నటి వరకు చక్రం తిప్పి, కంటి చూపుతో రాష్ట్రాన్ని శాసించింది జగనే కదా...! అలాంటిది ఇప్పుడు చంద్రబాబుపై పోరాటానికి రాష్ట్రంలో ఒక్కశాతం ఓట్ షేర్ కూడా లేని కాంగ్రెస్ పార్టీ కావాల్సి వచ్చిందా? ఏపీలో కూటమి ప్రభుత్వం చేసే అక్రమాలను ప్రశ్నించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీపై ఉందా..? మరి ఇక్కడ వైఎస్సార్‌సీపీ ఎందుకు..? ఈ ప్రశ్నకు మాటల్లో మ్యాజిక్ తప్ప లాజిక్ లేని జగన్‌మోహన్‌రెడ్డే సమాధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి సహాయంతో చంద్రబాబు కాంగ్రెస్ అగ్రనాయకులతో హాట్‌లైన్‌లో మాట్లాడుతుంటే, దాదాపు గత పుష్కరకాలంగా హస్తిన కోటను ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్న బీజేపీ అధిష్టానానికి ఆ విషయం తెలియకుండా ఉంటుందా. ఇంత చిన్న విషయాన్ని కూడా జగన్ ఎందుకు గమనించలేకపోతున్నారో ఆ దేవుడికే తెలియాలంటున్నారు విమర్శకులు.

## కోర్టులకెళ్లయినా పోరాడొచ్చు కదా!

ఎన్వీ రమణ... గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తెలుగు బిడ్డ. ఈయన్ని చీఫ్ జస్టిస్ పదవికి సిఫార్సు చేయవద్దంటూ, ఏకంగా అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి బాబ్డేకు ముఖ్యమంత్రి హోదాలో లేఖరాసి సంచలనం కలిగించిన వ్యక్తి జగన్. ఇక తన కేసులను వాదించడం కోసం స్పెషల్ ఫ్లైట్‌లలో హస్తిన నుంచి ఆగమేఘాలపై పేరు ప్రఖ్యాతులున్న లాయర్లను కోట్లు వెచ్చించి ఆంధ్రప్రదేశ్‌కు రప్పించిన సందర్భాలకి లెక్కేలేదు. అలాంటిది గత ఎన్నికల్లో పోలైన ఓట్లకంటే 48 లక్షలు అధికంగా(అంటే 12 శాతం) కౌంటింగ్ సమయంలో నిజంగా లెక్కించి ఉంటే, ఆ విషయాన్ని బట్టబయలు చేసే సత్తా మా జగన్‌కి లేదా? కేంద్రాన్ని నిలదీసే గుండె మా జగన్‌కి లేదా? కోర్టుల్లో కేసు వేసే ధైర్యం మా అధినాయకుడికి లేదా? ఇవీ సగటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తను, అభిమానిని వేధిస్తున్న ప్రశ్నలు. ఇలా తన ముందున్న ప్రత్యామ్నాయాలను వాడుకోకుండా గాలిపోగు చేసి, ఎంత గోల చేసినా ఫలితం ఉండదనే విషయాన్ని జగన్ ఇప్పటికైనా గుర్తిస్తే ఆయనకు, ఆయన పార్టీకి మంచిదనే అభిప్రాయం వైసీపీ శ్రేణులనుండి వ్యక్తమవుతోంది. అలా కాకుంటే అథోగతి పాలుకాక తప్పదని రాజకీయ విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. మరి ఈ విషయాలన్నీ గమనించుకుని అధినాయకుడు ఇప్పటికైనా మారుతాడో లేదో అన్న ఆందోళన సగటు వైసీపీ కార్యకర్త స్థాయి నుండి ద్వితీయ శ్రేణి నాయకుల వరకు అందరిలో కనిపిస్తోంది..!

# జన్మభూమికి సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టం



## ముఖ్యమంత్రితో అజయ్‌కుమార్ భేటీ!

రాష్ట్ర సచివాలయంలో 20వతేదీ బుధవారం టిడ్కో గృహాలపై సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, హౌసింగ్ మంత్రి కొలుసు పార్థసారధి, ఏపీ టీడ్కో ఛైర్మెన్ వేములపాటి అజయకుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడ్కో కాలనీ నివాసాల ప్రస్తుత పరిస్థితిపై ఒక నివేదికను ముఖ్యమంత్రికి అందించారు. టీడ్కో ఇళ్ళని త్వరలోనే లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీ టీడ్కో ఛైర్మెన్ అజయకుమార్ ప్రత్యేకంగా కలిసి అభినందించి జ్ఞాపికను బహుకరించారు.

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మెన్ కృష్ణయ్య తన పుట్టిన ఊరు అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, జన్మభూమికి సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) అభినందించారు. కృష్ణయ్య స్వగ్రామమైన కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలో ఇటీవల సెయిల్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసిన 275 సోలార్ స్ట్రీట్‌లైట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ-4 కార్యక్రమం ద్వారా ప్రజలకు సేవచేసే అవకాశం కల్పిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పుట్టిన ఊరుని అభివృద్ధి చేసుకునేందుకు సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా సోలార్ లైట్లు ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. పీఎం సూర్యఘర్ కింద ఇలాంటి ప్యానెల్స్ పెట్టి సోలార్ విద్యుత్ ఇచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వల్ల ఒక్క రూపాయి కూడా కరెంట్ బిల్లు కట్టే అవకాశం ఉండదని, తిరిగి మనకే డబ్బులు వచ్చే వీలుంటుందన్నారు. కృష్ణయ్యను స్ఫూర్తిగా తీసుకుని అందరూ వారి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని విపిఆర్ కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ, కృష్ణయ్య తమ గ్రామంలో ప్రజలకు ఏ లోటు లేకుండా అన్ని వసతులు కల్పించారనన్నారు. ఇలాంటి వారు తమ నియోజకవర్గంలో ఉండటం సంతోషంగా ఉందని చెప్పారు.

### • వెంకన్నపురానికి విద్యుత్ కాంతుల శోభ




### పుట్టిన ఊరికి సేవ చేస్తే ఎంతో సంతృప్తి - కృష్ణయ్య

పుట్టిన ఊరికి సేవచేయడం ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతుందని, తాము పుట్టిన ఊరికి విద్యుత్ వెలుగులు తేవాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మెన్ కృష్ణయ్య చెప్పారు. అడిగిన వెంటనే 275 సోలార్ లైట్లు సమకూర్చిన సెయిల్ కంపెనీ ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామాలకు మంచి చేస్తేనే మన జీవితానికి సార్థకత ఉంటుందని స్పష్టం చేశారు. బకింగ్‌హామ్ కెనాల్ ను అభివృద్ధి చేసేలా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని ఈ సందర్భంగా ఆయన ఎంపీకి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, విపిఆర్ సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, డిప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 45 రోజుల పాటు... రామలింగాపురం అండర్ బ్రిడ్జ మూసివేత



### • 59 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులు ప్రారంభం

నెల్లూరులోని రామలింగాపురం అండర్‌బ్రిబడ్జిని ఇటీవల మూసివేశారు. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కనీసం 45 రోజుల పాటు కొంతమేరకు ట్రాఫిక్‌కి ఇబ్బంది ఉంటుంది. ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ రద్దీతో వాహనదారులకు అసౌకర్యం కలుగుతుంది కనుక సహృదయంతో అర్థం చేసుకోవాలని కార్పొరేషన్ అధికారులు కోరుతున్నారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సుమారు 59 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగరంలో ఇదెంతో కీలకమైన కూడలి ప్రాంతం కనుక, వాహనదారులు ఈ దారుల్లో వెళ్ళేటప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్ళాలని వారు సూచిస్తున్నారు.

## కిలాడీ లేడీకి పోలీసు బేడీలు..

# అరుణ అరెస్టు



***గత వారం రోజులుగా నెల్లూరుజిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనానికి చిరునామాగా మారిన నెల్లూరుకు చెందిన లేడీ డాన్ నిడిగుంట అరుణని కోవూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి ఆమె కారు డిక్కీలో దాక్కొని హైదరాబాదుకి పారిపోతుండగా బుధవారం తెల్లవారు ఝామున 3గంటల ప్రాంతంలో ప్రకాశంజిల్లా అద్దంకి సమీపంలో పోలీసులు అరుణని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఆమెని మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా కోర్టు ఆమెకి 14 రోజులు రిమాండ్ విధించింది. కావలికి చెందిన బిల్డర్ మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరుణతో పాటు ఆమె అనుచరులని మరో ముగ్గురుని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అరుణని ఒంగోలు జైలుకి, ఆమె అనుచరులని నెల్లూరు జైలుకి తరలించారు.***

అసలేం జరిగింది...

నిడిగుంట అరుణ... 2019 వరకు ఆమె ఒక సామాన్య దళిత మహిళ. ఓ సాధారణ వ్యక్తి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆమె ఒక అసాధారణ శక్తిగా ఎదిగింది. రాజకీయ నాయకుల అండదండలు పొందింది. అధికారుల ఆశీస్సులు అందుకుంది. సాక్షాత్తూ జిల్లా పోలీసు కార్యాలయాన్నే తన కార్యకలాపాలకి అడ్డాగా చేసుకుంది. గూడూరుకి చెందిన పేరు మోసిన రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ అండతో మధ్యస్తాలు, సెటిల్మెంట్లు చేయడం మొదలుపెట్టింది. హత్యారోపణ రుజువై 2010 సంవత్సరం నుండి జిల్లా జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌ని బూచిగా చూపిస్తూ, తాను సొంతంగా ఒక గ్యాంగ్‌ని ఏర్పాటు చేసుకుని అంచలంచెలుగా ఆర్థికంగా ఎదిగింది. 2024 ఎన్నికలలో సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి ఇండిపెండెంటు అభ్యర్థిగా బరిలో దిగే స్థాయికి ఆమె చేరుకుంది. 2024లో ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి వచ్చినా ఆమె పవర్ తగ్గలేదు. తాను ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్న కరుడుకట్టిన నేరస్తుడు శ్రీకాంత్‌ని పెరోల్‌పై విడిపించడానికి కొత్త ప్రభుత్వంలో పావులు కదిపింది. రాజధానిలో కూర్చొని చక్రం తిప్పింది. 2010 నుండి యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్ 2014లో జైలు నుండి తప్పించుకున్నాడని, నాలుగున్నర సంవత్సరాల తరువాత అంటే 2018లో తప్పనిసరి పరిస్థితులలో మళ్ళీ లొంగిపోయాడని పోలీసు అధికారులు హోం శాఖకు రిపోర్ట్ పంపారు. పెరోల్ ఇవ్వడం సాధ్యం కాదని ప్రతిపాదన తిప్పికొట్టారు. అయితే, ఇద్దరు ఎస్.పి.లు నిరాకరించినా, జైలు సూపరెండెంట్ సమ్మతించకపోయినా, హోంశాఖ అధికారి పెరోల్ రిజెక్టెడ్ అని జీఓ ఇచ్చినా వీటన్నిటినీ పక్కనపెట్టి అదే హోం శాఖ కార్యదర్శి శ్రీకాంత్‌కి పెరోల్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీని వెనుక ఎవరున్నారు? అంటూ ఒక దినపత్రిక ఆరా తీయడంతో అరుణ గుట్టు రట్టయ్యింది. ఇదెలా సాధ్యం? అంటూ ఆ దినపత్రిక కథనం రాసింది. "ఏ పని కోసం ఈ పెరోల్...?" అంటూ మొదలుపెట్టి మొత్తం కథంతా బయటకి లాగింది. "ఖాకీనే వణికించే కిలేడీ" అంటూ మరో కథనంతో అరుణ భాగోతమంతా బయటకి లాగింది. దినపత్రిక అందించిన సమాచారంతో ఓ టీవీ ఛానల్ కూడా లోతుగా దర్యాప్తు మొదలుపెట్టి కథనాలు ప్రసారం చేయడంతో ప్రభుత్వం కళ్ళు తెరచింది. హుటాహుటిన హోంమంత్రి అనిత స్పందించింది, అధికారులను పురమాయించి శ్రీకాంత్ పెరోల్ రద్దు చేసింది. అరుణని అరెస్టు చేసి కటకటాల వెనుకకి పంపించింది.

ఇదే సమయంలో.... అనేక ఛానళ్ళు సామాజిక మాధ్యమాలు ఎవరికి తోచిన రీతిలోవాళ్ళు కథనాల్ని ప్రచారం చేశారు. ఈ క్రమంలో అరుణ, శ్రీకాంత్‌ల శృంగార కార్యకలాపాల వీడియోలు కూడా బయటకి వచ్చాయి. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కోసం చేరి ఓ వైపు ఒక చేతికి కట్టుకట్టుకుని, మరోచేత్తో అరుణతో శృంగారం సాగిస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో స్పష్టంగా దర్శనమిచ్చాయి. కొంతమంది అరుణతో ఇంటర్వ్యూ కూడా చేసి నిజాలని రాబట్టే ప్రయత్నం చేశారు. ఆ ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలని అరుణ వెల్లడి చేసింది. తనకి గతంలోనే వివాహం జరిగిందని, తన భర్తప్రమాద వశాత్తు మరణించాడని ఆమె చెప్పింది. అయితే తన భర్త గొంతు లాగానేవున్న శ్రీకాంత్ వాయిస్ తనని ఆకర్షిందని, దాంతో తాను శ్రీకాంత్‌తో ప్రేమలోపడ్డానని, ఇద్దరం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని, అందుకోసం పెళ్ళికార్డులని కూడా ప్రింటు చేయించానని చెప్పింది. ఆ పెళ్లికోసమే శ్రీకాంత్ పెరోల్ కోసం తాను ప్రయత్నం చేసినట్లు ఒప్పుకుంది. అనవసరంగా తనని తప్పుపడుతున్నారని, తాను నోరు విప్పితే చాలామంది పేర్లు బయటకి వస్తాయని బెదిరించింది. ప్రస్తుతం ఇప్పుడామె శ్రీకృష్ణ జన్మస్థానంలో ఉంది.

### ఉలిక్కిపడ్డ జిల్లా!

అతి ప్రశాంతమైన నెల్లూరుజిల్లాలో అరుణ లాంటి లేడి డాన్ కార్యకలాపాని గురించి తెలుసుకున్న జిల్లా వాసులు ఉలిక్కి పడ్డారు. నెల్లూరులో ఎప్పుడూ లేని కొత్త సంప్రదాయాలకు తెరలేపిన ఆమె చర్యలని తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు. ఆమె వెనుకవున్న రాజకీయ నేతలు, అధికారులు ఎవరైవుంటారబ్బా...? అని ప్రశ్నించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక జిల్లా స్థాయి ఐపీఎస్ అధికారి ఆమెకు పూర్తి స్థాయి స్వేచ్ఛని ఇచ్చి ప్రోత్సహించాడని ఖాకీలే గుసగుసలాడుకుంటున్నారు. అలాగే జిల్లాకి చెందిన కొంత మంది మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రులతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని కొంతమంది ప్రజాప్రతినిధుల అండదండలు కూడా ఆమెకి వున్నాయన్న వార్తలు గుప్పుమంటున్నాయి.

అంతమంది అధికారులు కాదన్నా నిబంధనలకు విరుద్ధంగా శ్రీకాంత్‌కి పెరోల్ ఎలా వచ్చిందన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. దీనివెనుక ఎవరున్నారో నిజాలని నిగ్గు తేలుస్తామని హోంమంత్రి అనిత ప్రకటించింది. వాళ్ళుఎంతటి స్థాయిలో వున్నా విడిచి పెట్టబోమని అనితమ్మ శపథం చేసింది. ఈ అరుణ కథ ఏ మలుపు తీసుకుంటుందో, జైల్లో వున్న ఆమె ఎవరి పేర్లు వెల్లడిస్తుందో, పోలీసులు స్వాధీనం చేసుకున్న అరుణ మొబైల్ ఫోన్లలో ఎవరెవరి భాగోతాలు దాక్కొని ఉన్నాయో, అనితమ్మ ఎవరి భరతం పట్టబోతుందో వేచి చూడాల్సిందే!

లాయర్
ఆగస్టు 22, 2025

# కొడిగట్టిపోతున్న..మన తెలుగు వెలుగు!

కమ్మనైన మన తెలుగుభాష కనుమరుగైపోతోందా?.. మాతృభాషపై నానాటికీ అనాదరణ పెరిగిపోతోందా?..అనే ప్రశ్నలకు భాషాభిమానుల నుంచి ఔననే సమాధానం వస్తోంది. ఆధునికత పెరిగిపోవడం, విదేశీమోజుతో ఆంగ్లభాష పట్ల అభిమానం పెరుగుతున్నదే తప్ప, తెలుగుభాష మీద మమకారం సన్నగిల్లిపోతోందన్న అభిప్రాయాలే సర్వత్రా వినపడుతున్నాయి.ఔను!..నిజం చెప్పాలంటే అంతా సెల్‌ఫోన్ల మాయాలోకం, మరోవైపు పాశ్చాత్య విషసంస్కృతి ప్రభావం మన భాషా వైభవాన్ని మసకబారుస్తోంది. అమ్మచేతి గోరు ముద్దలతో వినిపించే ముద్దుమాటలు కూడా రానురాను కరువైపోతున్నాయా?.. అనిపిస్తోంది. అయినా, పాతకాలం నాటి దేదీప్యమానమైన మన తెలుగు వెలుగు ఇప్పుడేమైంది?. అద్భుతమైన పదాలు, పాటలు, కావ్యాలు.. హృదయాలను హత్తుకునే మన జాన పదాలు, జ్ఞానపదాలు ఇప్పుడేమై పోయాయి. చిన్నతనంలోనే వినే అనేకరకాల నీతికథలని ఏ కాకి ఎత్తుకుపోయింది?. లెక్కలేనన్ని మన సామెతలు, సంభాషణలు, ప్రహసనాలు, అపూర్వమనిపించే నాటికలు నాటకాలు, పల్లెప్రజల అచ్చమైన పల్లెపాటలు ఎటుపో యాయి?.. తెలుగువారికే సొంతమనిపించే అద్వితీయమైన పద్యాలు.. ఆ రాగాలు ఎక్కడ వినిపిస్తున్నాయి? గతాన్ని పోల్చి చూసుకుంటే అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా ఉంటోంది. వెయ్యేళ్ళ క్రితం నాటి ప్రాచీనభాష, శతాబ్దాల తరబడి వారసత్వ సంపదగా వస్తున్న మన తెలుగుభాష, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా ప్రపంచవ్యాప్తంగా పేరెన్నికగన్న మన తెలుగుభాషను తెలుగువారే పట్టించుకోకపోవడం దుర్గతి కాక మరేమిటి?.. మన భాషపట్ల మనకే ప్రేమ లేనప్పుడు ఇతర భాషలని ఏమనుకున్నా ప్రయోజనం ఏముంటుంది?.. మన భాషను మనం వృద్ధి చేసుకుంటూనే, ఏ భాషనైనా నేర్చుకోవచ్చు. అందులో ఎవరికీ అభ్యంతరం ఉండనక్కర లేదు. అయితే, తల్లి వేరు ఒట్టిపోకుండా చూసుకున్నప్పుడే చెట్టు కూడా శాఖోపశాఖలుగా అభివృద్ధి చెందుతుంది. ఎవరు ఏ భాషను అభ్యసించినా, మాట్లాడుకున్నా, పుట్టుకతోనే తల్లి నుంచి అబ్బిన మాతృభాషను మరచిపోతే ఎలా?.. అయినా.. ఎంత చరిత్రను తన గుండెల్లో పొదువుకుందో మన తెలుగు భాష. ప్రాచీనకాలం నాటి భూర్జ పత్రాలు.. తాళ పత్రాల నుంచి, రాళ్లమీద శాసనాల దగ్గర నుంచి రాగిరేకుల మీదుగా.. ఇప్పటి దాకా ఎన్నెన్ని మార్పులు చెందుతూ వచ్చిందో చెప్పలేం. తాటాకుల మీద రాసే రోజుల్లో ఒక్క పద్యశతకం రాయాలంటే ఎంత కష్టమో!.. తాటాకుల మీద నుంచి నేటి కాగితాల వరకు, నేలమీద ఓనమాలు దిద్దిన కాలం నుంచి మొన్నమొన్నటి పెద్దబాలశిక్ష వరకు, ఇప్పుడు ఆధునిక కాలంలో కంప్యూటర్ల భాష వచ్చే వరకు..అన్నిటికీ పునాది భాష..మన తెలుగుభాషే కదా!... గిడుగు వారి అడుగుజాడల్లో తెలుగుభాష మరిన్ని సొగసులద్దుకుంటూ పండిత పామరులను సైతం ఆకట్టుకోవడానికి మరింకెంత కాలం పట్టి ఉంటుంది?.. ఏనాడైనా ఆలోచించి ఉంటామా?..లేదు. కనుకనే, మన భాషకీ దుర్గతి పట్టింది. కన్నడంతో పాటు తెలుగు భాషను కూడా ప్రాచీన భాషగా గుర్తించినా, మన భాషకు ఇతర భాషలకున్న ఆదరణ మాత్రం కరువవుతూనే ఉంది. ప్రాథమిక స్థాయిలో కూడా పాఠశాలల్లో తెలుగు విద్యాబోధన నామమాత్రంగానే ఉంది. జీవనోపాధికి ఆంగ్లభాష ఆధారమైపోయిన నేటి రోజుల్లో, జీవభాష అయిన తెలుగుభాష మాత్రం నీరసపడుతూనే ఉంది. ప్రపంచంలో ఆరున్నర వేలకు పైగానే భాషలుంటే, మనదేశంలో అధికారిక గుర్తింపు కలిగిన 24 భాషల్లో తెలుగుభాష ఒకటి. అంతటి ప్రాధాన్యత ఉన్న తెలుగుభాష నానాటికీ మసకబారిపోతుండడం అత్యంత బాధాకరం. ఇలాగే కొంతకాలం సాగితే భవిష్యత్తులో తెలుగుభాష, తెలుగు అక్షరాలు ఏ మ్యూజియంలో ఉన్నాయో వెతుక్కోవాల్సి ఉంటుంది. అందుకే ఇకనైనా మేలుకోవాలి. తెలుగు భాష పరిరక్షణకు ప్రతిఒక్కరూ కంకణం కట్టుకోవాలి. మన మాతృభాషను మృతభాష కాకుండా కాపాడుకోవాలి. ప్రజలు మాట్లాడుకునే భాషగా తెలుగుభాషకు జీవం పోసిన గిడుగు వారి అడుగుజాడల్లో తెలుగు భాషోద్ధరణకు సంకల్పం చేసుకోవాలి. భాషాయోధులతో పాటు, ప్రజలు కూడా తెలుగు భాషకు చేయెత్తి జై కొట్టాలి. అప్పుడే.. తెలుగుభాషా దినోత్సవాలకి కూడా మునుపటి వెలుగుతో పాటు దివ్యమైన తేజస్సు కూడా వస్తుంది.

**(ఆగస్టు 29 తెలుగుభాషా దినోత్సవం..**
**వ్యావహారిక భాషోద్యమ పితామహుడు**
**గిడుగు వెంకటరామమూర్తి జయంతి)**

# బెజవాడ గోపాలరెడ్డిని విస్మరించారు!

నెల్లూరుజిల్లా గర్వించదగిన నేత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు. ఒక్క నెల్లూరుజిల్లాయే కాదు, తెలుగుజాతి మొత్తం గుర్తుపెట్టుకోవలసిన మహా నాయకుడు గోపాలరెడ్డి గారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా కేంద్రమంత్రిగా, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నరుగా ఆయన సేవలు చిరస్మరణీయం. కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా.. కవిగా, సాహితీ సమ్రాట్టుగా గోపాలరెడ్డి గారికి గుర్తింపు వుంది. అలాంటి ఘనచరిత్ర కలిగిన నాయకుడిని మన నేతలు, అధికారులు విస్మరించారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో ఆయన విగ్రహం వుంది. బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌గా ఆ కూడలి ప్రాచుర్యం పొంది, ప్రాముఖ్యత సంతరించుకుంది. గోపాలరెడ్డి గారి జయంతి, వర్ధంతులని అటు అధికారులు కానీ, ఇటు రాజకీయ నేతలు కాని పట్టించుకోవడం లేదు. గతంలో కూడా అనేక సందర్భాలలో ఇదే విషయంపై పలు దినపత్రికలలో పాటు మన 'లాయర్'లో కూడా వార్తలు ప్రచురితమయ్యాయి. కానీ, ఎవరికీ చీమకుట్టినట్లు కూడా లేదు. మొన్న ఆగస్టు 5వతేదీ గోపాలరెడ్డిగారి జయంతి. ఆరోజు ఆయన విగ్రహానికి కనీసం ఎవరూ ఒక పూలమాల వేసిన పాపాన కూడా పోలేదు. మార్చి 9న ఆయన వర్ధంతి కూడా. ఈ రెండు సందర్భాలలో కూడా జిల్లావాసులు ఆ మహానుభావుడిని స్మరించుకోలేక పోవడం దారుణం.

ఎస్.పి.శ్రీనివాసులు, బాలాజీనగర్.

# ఆటోవాలాల అడ్డాగా ప్రధాన కూడళ్లు!

నెల్లూరు నగరంలో ఆటోవాలాలకి అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. ముఖ్యంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో వీరిదే ఇష్టారాజ్యంగా ఉంటోంది. ఆత్మకూరు బస్టాండు మొదలు కనకమహల్, గాంధీబొమ్మ, వీఆర్‌సీ, మద్రాసు బస్టాండు, ఆర్.టీ.సీ, మాగుంట విగ్రహం, యం.జి.మాల్, వేదాయపాళెం సెంటర్‌తో పాటు మినీబైపాసులోని భక్తవత్సల నగర్, కొండాయపాలెం, అన్నమయ్య సర్కిల్, రామలింగాపురం జంక్షన్, పూలే బొమ్మ ప్రాంతాలలో ఎక్కడపడితే అక్కడ రోడ్డుకి అడ్డంగా ఆటోలను ఆపేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు వున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆటోవాలాల దెబ్బకి ద్విచక్ర వాహనదారులు కూడా హడలిపోతున్నారు. నగరమంతా ట్రాఫిక్ వ్యవస్థ అస్థవ్యస్థంగా వుండడంతో ఆటోవాలాలది ఇష్టారాజ్యంగా ఉంటోంది. వీరికి తోడుగా సిటీబస్సుల డ్రైవర్లు కూడా మేమేం తక్కువ అన్నట్లుగా వ్యవహరిసున్నారు. టౌన్‌లో మోటారు బైక్‌లో వెళ్లాలంటే వణుకుపుడుతోంది. పోలీసు పెద్దలు నిద్రమత్తు వదిలి నగర ట్రాఫిక్ క్రమ బద్ధీకరణపై దృష్టిపెట్టాలి.

– ఆర్.పరమేశ్వర్, మిలటరీ కాలనీ.




# దేశ పారిశ్రామిక రంగానికే తలమానికం శ్రీసిటీ!

ప్రతిష్టాత్మకమైన ప్రత్యేక పారిశ్రామిక వాడ శ్రీసిటీ దేశ పారిశ్రామిక రంగానికే తలమానికంగా ఎదగడం సంతోషదాయకం. 31దేశాలకి చెందిన 45వేల కోట్ల పెట్టుబడులతో, 240 కర్మాగారాలతో, ఇప్పటికే 65వేలమందికి ఉపాధి కలిగేలా అభివృద్ధిసాధించడం సామాన్యమైన విషయం కాదు. పదిహేడేళ్ళ కాలంలో ఇంతటి అనూహ్య స్థాయిలో ప్రగతి సాధించడం అభినందనీయం. ముఖ్యంగా 50% మించి మహిళలే ఇక్కడ ఎక్కువగా పని చేయడం గర్వనీయం.యాజమాన్యానికి నా అభినందనలు.

అవయవ దానంపై గత వారం వచ్చిన సంపాదకీయం అర్థవంతంగా వుంది. చక్కని అవగాహన కల్పించారు.

సి.ఆర్.విశ్వేశ్వరరావు,
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.




# పంచాయతీలకు వీడని..'రాజకీయ' గ్రహణం!

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు పట్టిన గ్రహణం వీడడం లేదు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని మన నాయకులు ఉపన్యాసాల్లో గొప్పగా చెప్తుంటారు. కానీ, ఏళ్ళు గడిచిపోతున్నా పల్లెల ప్రగతి రథం మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. ఎటుచూసినా మన పల్లెటూళ్ళు సమస్యల నిలయంగానే ఉంటున్నాయి. రాజకీయాలే పల్లెల జీవితాల్ని శాసిస్తుండడం, ప్రతి విషయంలోనూ రాజకీయ జోక్యం ఉంటుండడంతో ఏ పనీ సజావుగా సాగడంలేదు. గ్రామాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా తయారైంది. గత వైకాపా ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటు, గ్రామ పంచాయతీల వ్యవస్థని కూడా నాశనం చేసింది. గ్రామాల ప్రగతికి గుండుగీసి సున్నంబొట్లు పెట్టింది. దీంతో ఇప్పటికీ గ్రామాలు కోలుకోలేకపోతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక, దాన్ని సరిచేయాలని చూస్తున్నా, నాయకుల మధ్య సహకారం, సమన్వయం లేకపోవడంతో , గ్రామాల్లో పేరుకు పోయిన సమస్యలు కొలిక్కి రావడం లేదు.

## అవినీతే అన్నిటికీ మూలం :

నేడు గ్రామాల్లోనే కాదు దేశమంతా ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తోంది. 'పైసా మే పరమాత్మా హై' అన్నట్లుగా, కాసులు లేనిదే కార్యం జరగడం లేదు. చెట్టుకు చెద పట్టినట్లుగా సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న దురాశ, ధనాశల ప్రభావం అన్ని వ్యవస్థలతో పాటు గ్రామీణ వ్యవస్థ పై కూడా పడింది. స్వచ్ఛమైన మనసులతో, ప్రశాంత వాతావరణంలో ఉండే మన పల్లె వాసులు కూడా క్రమేణా రాజకీయ నేతల స్వార్థాలకు బలైపోతున్నారు. కక్షలు కార్పణ్యాలతో, పార్టీల విభేదాలు, అధిపత్యాల మధ్య నలిగిపోతన్నారు. ఈ క్రమంలో గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంటున్నాయి. పంచాయతీల్లో పన్నుల వసూళ్లు జరుగుతున్నా పనులు మాత్రం ఆశించిన మేరకు జరగడం లేదు. చాలాచోట్ల ఎమ్మెల్యేలదే పెత్తనం. గ్రామనాయకులకి అయ్యగారికీ సరిపడకపోతే, ఇక ఆ గ్రామానికి దిక్కూ దివాణం ఉండదు. దాదాపు ప్రతి గ్రామంలోనూ ఇదే దుస్థితి. దీంతో గ్రామాల్లోని నాయకులు, అధికారులు గ్రామాభివృద్ధిని పట్టించుకోవడం లేదు. అసలు, పంచాయతీ అధికారులకు, గ్రామ సర్పంచ్‌లకి మధ్య సమస్వయం ఉండడం లేదు. చాలా గ్రామాల్లో సర్పంచ్‌లకి అసలు విలువే వుండడం లేదు. దీంతో అడిగేవారూ, ఆదుకునేవారు లేక గ్రామాలు అధోగతి పాలైపోతున్నాయి.

## వ్యవస్థ పెద్దదే అయినా అన్నీ సమస్యలే...

గ్రామ పంచాయతీలకు చెప్పుకోవడానికి పెద్ద వ్యవస్థే ఉంది. కానీ అన్నీ సమస్యలే. గ్రామాల్లో ప్రజలకు మంచినీటి వసతి, రోడ్లు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం, విద్యుత్ వెలుగులు తదితర కనీస మౌలిక సదుపాయాల కల్పన వంటివన్నీ కుంటుపడి పోయాయి. ఈనాటికీ దారి, డొంకా లేని ఊళ్లుగానే అనేక పల్లెటూళ్ళు కునారిల్లుతున్నాయి. అక్కడక్కడా స్థానిక నాయకులకి బలమున్నచోట మాత్రం కొన్ని పనులు జరుగుతున్నాయి తప్ప, అధికసంఖ్యలో గ్రామాలు అనాదిగా తీరని సమస్యలతో కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. తాగునీటికి కూడా అనేక గ్రామాల్లో ప్రజలు అల్లాడాల్సిన దుస్థితి ఏర్పడింది. స్వచ్ఛమైన నీటిని పుష్కలంగా అందించే ఆర్థిక వెసులుబాటు గ్రామాలకి ఉండడం లేదు. ముఖ్యంగా, మురుగునీటి పారుదల సక్రమంగా లేక ఆ మురుగంతా వీధుల్లో మడుగులు కడుతుంటుంది. చెత్తాచెదారాన్ని ఎత్తివేసే నాథులుండరు. రోడ్లల్లో ముళ్ళపొదలు పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బందులుగా ఉన్నా చేసేదేమీ ఉండదు. రోగాల బారినపడి ప్రజలు సతమతమవుతుంటే అధికారులు, పాలకులు మాత్రం ఎవరికీ పట్టనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కావలసిన స్థాయిలో నిధులు మంజూరు కావడంలేదు. మరోవైపు పంచాయతీల్లో సంబంధిత వ్యవస్థలను నడిపేందుకు సుశిక్షుతులైన సిబ్బంది కానీ, సాంకేతిక వనరులు కానీ లేకపోవడం కూడా పంచాయతీ వ్యవస్థకి అతిపెద్ద లోపం. అంతేకాదు, మన సామాజిక వ్యవస్థలో ఎంతో కీలకమైన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల మధ్య అధికారాలు, పని విభజనలు కూడా ఇప్పటికీ అస్తవ్యస్తంగా అయోమయంగా ఉండడం పల్లెల దీన స్థితికి మరో పెద్ద కారణం.

## నిధులున్నా ఖర్చుపెట్టే నాథులు లేరు..

గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కేంద్రం అందించే 15వ ఆర్థికసంఘం నిధులు ఎంతో కీలకం. అయితే, మన రాష్ట్రంలో ఆ నిధులను సరైన రీతిలో ఉపయోగించుకోకపోగా గత ప్రభుత్వం ఆ నిధులను పక్కదారి పట్టించేసిందన్న ఆరోపణలు వున్నాయి. తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు కోట్లాదిరూపాయలు ఉన్నా, ప్రజా ప్రతినిధులకు గ్రామస్థాయి పాలకులకు, అధికారులకు మధ్య సమన్వయం లోపించడంతో ఆ నిధులకు కూడా గ్రహణం పట్టింది. పంచాయతీలకు, స్థానిక సంస్థలకు కేంద్రం ప్రతిఏటా విడుదల చేస్తున్న 2వేల కోట్లకు పైగా నిధుల్లో 70 శాతం వరకు పంచాయతీలకే కేటాయిస్తున్నారు. అయితే, పనులు చేయక.. సుమారు 250కోట్లకు పైగానే నిధులు మురిగిపోతున్నాయంటే గ్రామస్థాయిలో రాజకీయాలు ఎంత దౌర్భాగ్యంగా ఉన్నాయో తేటతెల్లమవుతుంది. త్వరలోనే రెండోవిడతగా కేంద్రం మరో 1370 కోట్లు ఇవ్వనున్నట్లు కూడా సమాచారం. అటు కేంద్రం నుంచి ఆర్థిక సహకారం, ఇటు కూటమి ప్రభుత్వం నుంచి చేయూత, 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుగా గ్రామాలు నేటికీ కనీస సదుపాయలను కూడా సమకూర్చుకోలేని దుర్గతిలోనే ఉన్నాయి. ఇకనైనా ఈ తీరు మారాలి. రాజకీయ నాయకులు భేషజాలకు పోకుండా, గ్రామాల్లో ఉన్న స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించాలి. ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా, కేంద్రం ఇస్తున్న నిధులను మురిగిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రజలెన్నుకున్న నాయకుల మధ్యనే సహకారం లేకపోతే పరిస్థితులు ఇలాగే ఉంటాయి?. ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రజల అభ్యుదయానికి బాటలు వేయాలి. ఇప్పుడున్న అవకాశాలను సద్వినియోం చేసుకొని పల్లెల పురోభివృద్ధికి పాటుపడాలి...!

- రాజశ్రీ

# అనాథలపై..విపిఆర్ 'వాత్సల్య'ం!

## • 5 లక్షల విరాళమిచ్చిన వేమిరెడ్డి దంపతులు



అనాథలు, అసహాయులు, దీనులు-దివ్యాంగులకు అండగా తామున్నామంటూ, వారికి చేయూతగా జిల్లాలోని అనేక స్వచ్ఛంధ సంస్థలకు లక్షలాది రూపాయలను విరాళాలుగా అందిస్తూ విపిఆర్ దంపతులు ఎంతోకాలంగా తమ ఔదార్యాన్ని చాటు కుంటున్నారు. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా అనేక దేవాలయాలకు, అనేక ధార్మిక కార్యక్రమాలకు, సామాజిక సేవలకు కూడా కోట్లాది రూపాయల ధనాన్ని వెచ్చిస్తూనే ఉన్నారు. తాజాగా, ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవం రోజున నెల్లూరు నగరంలోని 'వాత్సల్య' అనాథశరణాలయం వారికి, స్థానిక మాగుంట లేఅవుట్‌లో ఉన్న తమ నివాసంలో వేమిరెడ్డి దంపతులు 5 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చి, 'వాత్సల్య' అనాథల పట్ల తమకున్న వాత్సల్యాన్ని నిరూపించుకున్నారు.

### విపిఆర్ దంపతుల సాయం మరచిపోలేం...

సేవాభూషణులు..దాన గుణసంపన్నులు..నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఎంతోకాలంగా 'వాత్సల్య' అనాథ శరణాలయానికి అన్నివిధాలా అండదండలందిస్తున్నారని ఈ సందర్భంగా వాత్సల్య కార్యదర్శి జి.వి.సాంబశివరావు చెప్పారు. వారందించిన భూరి విరాళాలతో వాత్సల్యలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, ముఖ్యంగా మంచినీటి సదుపాయం వంటి వసతులు ఏర్పాటు చేసుకోగలిగామని, అదంతా వారి పుణ్యమేనని ఆయన అన్నారు.

# గవర్నర్ ప్రశంసలందుకున్న.. డాక్టర్ స్వప్న



నెల్లూరుకు చెందిన డాక్టర్ జెకె స్వప్నకి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు లభించాయి. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా అమరావతిలో గవర్నర్ నివాసంలో జరిగిన తేనేటి విందులో ఆమె పాల్గొని, గవర్నర్ నుంచి సన్మానం అందుకు న్నారు. ఈ సందర్భంగా సమాజానికి ఆమె చేస్తున్న యోగా సేవలను గవర్నర్ అభినందించారు.

# శ్రీసిటీలో వేడుకగా.. జెండా పండుగ!



అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీలో ఆగస్టు 15న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బిజినెస్ సెంటర్ ప్రాంగణం వద్ద జరిగిన ఈ కార్యక్ర మంలో శ్రీసిటీ ఇన్చార్జి డీఎస్పీ జి.చెంచుబాబు పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగరవేసి జెండా వందనం చేశారు. శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది కవాతు నిర్వహించారు. సెక్యూరిటీ- విజిలెన్స్ హెడ్ వై.రమేష్ అతిథులకు స్వాగతం పలి కారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ, మన దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, దేశ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. శ్రీసిటీ ప్రగతిని ఆయన ఈ సందర్భంగా ప్రశంసిస్తూ, వెనుకబడిన ప్రాంతంలో నెలకొల్పిన శ్రీసిటీ.. ఇప్పుడు వేలాదిమందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. పారిశ్రామిక అభ్యున్నతికి శ్రీసిటీ యాజమాన్యం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అనంతరం, విధుల్లో విశేష సేవలు చేస్తున్న వారిని గుర్తిస్తూ, శ్రీసిటీలోని సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, ల్యాండ్‌స్కేపింగ్, ఇంజనీరింగ్, ఫోటోగ్రఫీ వంటి వివిధ విభాగాలకు చెందిన 38 మంది సిబ్బందికి, 'ఉత్తమ పనితీరు' అవార్డులను అందచేశారు.

### దేశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుకోవాలి - శ్రీసిటీ ఎం.డీ సందేశం

దేశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు అందరూ పాటుపడాలని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పిలుపునిచ్చారు. శ్రీసిటీ కుటుంబానికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు చెప్తూ, శాంతి సంతోషాలతో దేశప్రజలందరూ హాయిగా జీవించేందుకు మనమంతా కంకణబద్ధులం కావాలన్నారు.



### చిన్నబజారు

# సీఐకి సన్మానం

విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తూ అందరి ప్రశంసలందుకుంటున్న నెల్లూరులోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు స్వాతంత్ర్య దినో త్సవం రోజున ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ ఆయన్ను అభినందించి అవార్డునందజే శారు. ఈ సందర్భంగా ఇటీవల స్థానిక భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం తదితరులు దుశ్శాలువతో సీఐని సన్మానించి, ఆయన సేవలను కొనియా డారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు ఖుద్దూస్, కొమ్మల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### వీరంపల్లి విద్యార్థులకు..

# విద్యా సామగ్రి వితరణ

మనుబోలు మండలం వీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్థానిక స్పిక్ అండ్ గ్రీన్‌స్టార్ ఫెర్టిలైజర్స్ కంపెనీ వారు బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు మస్తానయ్య విజ్ఞప్తితో ఆ కంపెనీ వారు ముందుకు వచ్చి 60 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం పట్ల విద్యార్థుల తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆ కంపెనీ ప్రతినిధులు యు.అభిజిత్, గోపాల్‌నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ.. 'చలో కలెక్టరేట్'

అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిపోతున్నా ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు విషయాన్ని పట్టిం చుకోవడం లేదంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు కూడా సిద్ధమవుతున్నారు. హామీలు నెరవేర్చాలని కోరుతూ ఆగస్టు 22న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వ హించనున్నారు. ఆమేరకు ఇటీవల నెల్లూరు బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే విద్యారం గంలో విప్లవాత్మక మార్పులు తెస్తామని హామీ ఇచ్చిన టీడీపీ నాయకులు, అధికా రంలోకి వచ్చాక విద్యార్థుల అతీగతీ పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు రీయిం బర్స్‌మెంట్‌కి సంబంధించి ఉన్న కోట్లాది రూపాయల బకాయిలను నేటికీ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సమ స్యల సాధన కోసం జరిగే 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విద్యార్థులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, నాయకులు ప్రవీణ్, యజ్ఞేష్, సంతోష్ పాల్గొన్నారు.

# కంచి పరమేశ్వరరెడ్డి ఔదార్యం!

## • మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆత్మకూరులోని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి తన దానగుణంతో అనేకమంది పేద కుటుంబాలను ఆదుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. అందులోనూ ఆత్మకూరు పట్టణ పరిధిలో పేదకుటుంబాల్లోని వారెవరైనా చనిపోతే, ఆ కుటుంబసభ్యులకు తనవంతు సాయం అందిస్తుండడం విశేషం. ఇటీవల వివిధ కారణాలతో నలుగురు పేదల మృతిచెందడంతో వారి కుటుంబసభ్యుల ఇబ్బందులను గమనించి వారికి 10వేల రూపాయల వంతున ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన గొట్ల నారాయణమ్మ, 14వ వార్డుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా, వై.అంకమ్మ(15వ వార్డు), యాకసిరి సుబ్బ రాయుడు (21వ వార్డు) మరణించగా, మృతుల ఇళ్లకు వెళ్ళి వారి కుటుంబసభ్యులను పరామర్శించడం, నేరుగా వారి బాగోగులు తెలుసుకుని, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న ఆ పేదలకు సాయం అందజేశారు. దీంతో బాధిత కుటుంబాలతో పాటు, స్థానిక ప్రజలు కూడా కంచి వారి మంచితనాన్ని, దయాగుణాన్ని కొనియాడుతున్నారు.

# గౌతు లచ్చన్న జీవితం..ఆదర్శప్రాయం



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ చెప్పారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపారమని కొనియాడారు. గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్ణయించిన ప్రభుత్వానికి ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిర్మలాదేవి, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, మత్స్యశాఖ జేడీ కె.శాంతి, బీసీ నాయకులు జనార్ధన్‌రాజు, జనార్ధన్‌గౌడ్, భాస్కర్, పద్మజాయాదవ్, శ్రీనివాసులు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న.. మోపూరు కవిత్వం

## దీర్ఘకవితావిష్కరణలో వక్తలు



మోపూరు పెంచల నరసింహం కవిత్వం భావస్ఫోరకంగా ఉంటూ అందరినీ ఆకట్టుకుంటోందని పలువురు కవులు కొనియాడారు. ఇటీవల స్థానిక వెంకటేశ్వర విద్యాలయంలో నెల్లూరుకు చెందిన కవి మోపూరు రాసిన 'వీధి దీపాలు' దీర్ఘకవిత పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు మాట్లాడుతూ, 'వీధి దీపాలు' దీర్ఘకవితలో, 'శ్రమజీవుల పక్షాన వకాల్తా పుచ్చుకుని వీధి గొప్ప సామ్యవాదిగా అయిందనడం', 'మృత్యువు భయంకరమైనదే.. ఆకలిని మించింది కాదు కదా'.. అని చెప్పడం వంటివి ఆయన కవితా ప్రతిభకి ప్రతీకలని ప్రశంసించారు. ప్రముఖ కవి అవ్వారు శ్రీధర్‌బాబు 'వీధి దీపాలు' దీర్ఘకవితను సమీక్షించారు. పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి సభను నిర్వహించారు. పెరసం కార్యదర్శి తోట సులోచన, కవయిత్రి ప్రసూనాశరత్, కవులు ఇంద్రగంటి మధుసూదనరావు, అన్నం శివకృష్ణ, దుప్పటి రమేష్, సురేంద్ర, మునీంద్ర, కుని అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

# విశేష సేవలకు.. అవార్డులు

నెల్లూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విశేషసేవలందిస్తున్న ఏసీ (ఎన్‌ఫోర్స్‌మెంట్) పి.దయాసాగర్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్‌లకు రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నిశాంత్‌కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అవార్డులను బహూకరించారు. విజయవాడలో ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో వారిద్దరూ ఆ అవార్డులను స్వీకరించారు.

# విశ్వసాయిలో స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఆగస్టు 15న 79వ స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు వేడుకగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా. ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, భారతీయ పౌరులుగా మనం... మన ఇంటినే కాకుండా మనం ఉండే ఊరు, మన దేశం అంతా బాగుండేందుకు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఒకరికొకరు గౌరవించుకోవాలని, ప్రతి విద్యార్థి, ప్రతి వ్యక్తి దృఢ సంకల్పంతో తనవంతు కర్తవ్యాలను నెరవేర్చితే అన్ని రంగాల్లో మనమే ముందుంటామన్నారు. వైస్‌ఛైర్మన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి నిజాయితీగా క్రమశిక్షణతో పనిచేస్తే అది దేశ పురోభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక అన్నమయ్య క్యాంపస్, నిధి నిలయం క్యాంపస్, ఇస్కాన్ క్యాంపస్‌లలో జాతీయ పతాకాలను ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల పెన్షన్లు తొలగింపులో..

# కఠిన వైఖరి వద్దు..

**బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి**



దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్లతో, దివ్యాంగులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆయుబ్ ఖాన్‌కు బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సదరన్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్లలో ఎక్కువ మంది డాక్టర్లు పర్సంటేజీ తగ్గిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, దివ్యాంగుల పట్ల కఠిన వైఖరి అనుసరించకుండా వెరిఫికేషన్‌లు చేయాలని ఆయన కోరారు. గత ఐదు సంవత్సరాల ముందు, 60 శాతం శాశ్వత సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే స్కూటీ ఎలక్ట్రిక్ వాహనాల సదుపాయం లేదని, 80శాతం సదరం సర్టిఫికెట్ పొందిన వారికి ఈ వాహనాల సదుపాయం ఉందని ఆయన అంటూ, వాస్తవానికి గతంలో శాశ్వత సర్టిఫికెట్ పొందిన వారు వయసు పైబడిన కొద్దీ శరీరంలో సహజంగా శక్తిని కోల్పోతారని, రెండు కర్రల సపోర్టుతో నడిచే వ్యక్తికి పర్సంటేజ్ ఎంత ఉన్నా సామాన్యునితో సమానం కాదని, ఇటువంటి దివ్యాంగులకు కూడా ఎలక్ట్రిక్ స్కూటీలు అందించాలని ఆయన సూచించారు. పెన్షన్ సదుపాయం పొందాలంటే బిపిఎల్ మార్గదర్శకాలలోనూ ఉదాసీనంగా వ్యవహరించాలన్నారు. సదరన్ పత్రాల పునః పరిశీలన సమయంలోను దివ్యాంగుల పట్ల కఠిన వైఖరి అనుసరించొద్దని, ధనవంతుల కుటుంబాలను మినహాయిస్తే.. వాహనం, ఇన్‌కంటాక్స్ వంటి వాటిని ప్రామాణికంగా చూపి పెన్షన్లు తొలగించవద్దని ఆయన కోరారు.




# నెల్లూరు కబుర్లు

### బాధితులకు చేయూతగా..

# సీఎం సహాయనిధి

**- - ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - -**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధితులకు చేయూతగా సీఎం సహాయనిధిని అందజేస్తూ వారిని ఆదుకుంటున్నారని, సర్వేపల్లి నియోజకవర్గంలో ఈ విడతలో 58 మందికి రూ.46.75 లక్షలు మంజూరు చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న తమ కార్యాలయంలో బాధితులకు ఆమేరకు చెక్కులు అందజేశారు. సీఎం సహాయనిధి కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నా, ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులను పక్కన పెట్టి వారికి ఉదారంగా సాయం మంజూరు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రిని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు సీఎం సహాయనిధి ద్వారా 281 మందికి రూ.3.25 కోట్ల ఆర్థికసాయం అందిందని అంటూ, ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని జాతిపిత బాపూజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌వో హుస్సేన్‌సాహెబ్, పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100అడుగుల స్థూపం వద్ద జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. చిన్నారులకు కలెక్టర్ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయ కుమార్, డిఆర్‌డిఏ పీడీ నాగరాజకుమారి, డీసీఓ గుర్రప్ప, సమాచార పౌర సంబంధాల అధికారి ఎ.శివశంకర్‌రావు, పౌర సరఫరాలశాఖ అధికారి విజయ్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### 25 నుంచి..

# సాయిదర్బార్ వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 25, 26 తేదీల్లో మందిరం నాల్గవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 25న శ్రీ ఆదిలక్ష్మీ-చెంచులక్ష్మీదేవిల సమేత శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని, తొలుత సాయినామ సంకీర్తనా యజ్ఞం అద్భుతంగా ఉంటుందని మందిరం నిర్వాహకులు మధుసాయి తెలిపారు. ఆరోజున ఉదయం 6.30 నుండి రాత్రి 9 గంటల వరకు సాయినామ సంకీర్తన జరుగుతుందన్నారు. రెండోరోజున జరిగే పెంచల స్వామి కల్యాణోత్సవంలో, శ్రీ సాయినాథుని పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 24న 'అమ్మ భాషకి వందనం'

తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 24న నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవనంలో 'అమ్మ భాషకి వందనం' కార్యక్రమం నిర్వహిస్తామని నెల్లూరు జిల్లా రచయితల సంఘం వారొక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వివిపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొంటారని, డి.కె డబ్ల్యు కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా.కె కరుణశ్రీ పాల్గొని ఉపన్యసిస్తారని, న్యాయవాది-టాక్స్ కన్సల్టెంట్ ఇనమనమెళ్ళూరి నాగరాజారావు సభాధ్యక్షత వహిస్తారని నెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ తెలియజేశారు.

# డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో జెండా పండుగ




నెల్లూరు సరస్వతీనగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో ఆగస్టు 15న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణను రంగురంగుల కాగితాలతో, మువ్వన్నెల పతాకాలతో అలంకరించారు. 10వ తరగతి విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ చేస్తూ, జాతీయ జెండాలు చేతబట్టి తమ దేశభక్తిని చాటారు. జెండా వందనం చేసి, దేశభక్తి నృత్యాలతో అందరినీ అలరించారు. రుద్రమదేవి, భగత్‌సింగ్, ఝాన్సీలక్ష్మీబాయి వంటి స్వాతంత్ర్యవీరులను గుర్తుకు తెస్తూ, వారి వేషధారణలతో ఆకట్టుకున్నారు. డా. కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విద్యాసంస్థల జనరల్ మేనేజర్ ఎం.రామమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీలకి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

జిల్లాలో ఆధార్ కార్డులు లేని ఎస్టీల కోసం సెప్టెంబర్ 1 నుండి నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈనెల 18న కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఆయన సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎస్టీలకు మండల స్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించడం ద్వారా ఇప్పటివరకు 6000 మందికిపైగా ఆధార్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఇంకా మిగిలినవారి కోసం సెప్టెంబర్ 1 నుండి నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. డీఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్ఈ విజయన్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉపకార వేతనానికి

# దరఖాస్తులు పంపండి

తపాలాశాఖ ఫిలాటెలీ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. దీన్‌దయాళ్ స్పర్శ యోజన కింద పథకం కింద ఈ స్కాలర్‌షిప్ కోసం 6,9 తరగతి విద్యార్థులు సెప్టెంబరు 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

### ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



నెల్లూరు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఘనంగా జరిగాయి. వాకర్స్ ప్రతినిధులు ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణ రెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఫ్రెండ్స్ వాకర్స్ మాజీ ప్రెసిడెంట్.. 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, షేక్ నసీర్ అహ్మద్, బి.రామ్మోహన్‌రెడ్డి, బెజవాడ సునీల్‌రెడ్డి, టి.హరిబాబు, ఎం.పిచ్చయ్య, వినుకొండ వెంకటేశ్వర్లు, ఐ.సోను, అమరలింగం, నైజాం వెంకటేశ్వర్లు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, మన్నేపల్లి సురేష్, యరమాక శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో..వేడుకగా శ్రీకృష్ణాష్టమి!





## • పాల్గొన్న విపిఆర్ దంపతులు

*శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని ఇస్కాన్ మందిరం పండుగ శోభను సంతరించుకుంది. విద్యుద్దీపాలు, పూల అలంకరణలతో మందిరం కళకళలాడింది. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణపరమాత్మకు పూజలు జరిగాయి. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు.. సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు, టీటీడీ పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నికృష్ణుని వేషధారణలతో చిన్నారులు అలరించగా, పాటలు, శ్లోకాలు, చిత్రలేఖనం తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులతో పాటు, భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో మందిర ప్రాంగణం క్రిక్కిరిసిపోయింది.*

అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న స్థానిక ఇస్కాన్ మందిరంరలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మందిరం అధ్యక్షులు శుకదేవస్వామి నేతృత్వంలో, 'హరే కృష్ణ' భజనలతో, శ్రీకృష్ణ నామసంకీర్తనలతో మందిర ప్రాంగణం మార్మోగి పోయింది. విశేష హారతులు, 108 వంటకాలతో స్వామివార్లకు నైవేద్యం సమర్పించి, ఆ మహాప్రసాదాన్ని అందరికీ పంచారు. పూజా కార్యక్రమాల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకం చేసి పూజలు చేశారు. భక్తులందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇస్కాన్ మందిరం సావనీర్ (స్మారిక)ను వారు ఆవిష్కరించారు.

### మందిరానికి స్థలం కేటాయించండి

**- శుకదేవస్వామి అభ్యర్థన**

ఈ కార్యక్రమంలో ఇస్కాన్ గురువులు శుకదేవస్వామి మాట్లాడుతూ, ఇస్కాన్ మందిరానికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కుటుంబంతో గత 13 సంవత్సరాలుగా వున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనేక సందర్భాల్లో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఇస్కాన్ కార్యక్రమాలకి అండదండలు అందిస్తున్నారని, నెల్లూరు ఇస్కాన్ మందిరం అభివృద్ధిలో వేమిరెడ్డి దంపతుల పాత్ర అమోఘ మన్నారు. ప్రస్తుతం ఉన్న మందిరం నగర నడిబొడ్డున ఉన్నందు వలన భక్తులకి అసౌకర్యంగా ఉందని, తమకి ప్రభుత్వం మంది రానికి అవసరమైన స్థలం కేటాయిస్తే రెండు కోట్ల రూపాయలతో ఆధునిక ఆలయం నిర్మిస్తామని ఆయన ఈ సందర్భంగా కోరారు.

### ఇస్కాన్‌కి అండదండలందిస్తాం - వేమిరెడ్డి

శుకదేవస్వామి అభ్యర్థనకి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి స్పందిస్తూ, ఆ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి మందిరానికి స్థలం మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. అమెరికా వంటి అగ్రదేశాల్లో సైతం ఇస్కాన్‌కి మంచి ఆదరణ ఉందని, ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఇస్కాన్‌తో తమకి అనుబంధం కలగడం తమ అదృష్టమన్నారు. ఇస్కాన్ చేపట్టే ఎలాంటి ప్రజోపయోగ కార్యక్రమానికైనా తమ సహాయ సహకారాలు తప్పక ఉంటాయని ఆయన ప్రకటించారు.

### మానవ జీవితాలకి మార్గదర్శకం భగవద్గీత

**- ప్రశాంతిరెడ్డి**

కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, భగవద్గీత అత్యంత పవిత్రమైన గ్రంథమని, ఆ శ్రీకృష్ణపరమాత్మ మానవాళికి అందించిన అద్భుతమైన వరమని చెప్పారు. భగవద్గీత మానవ జీవితానికి మార్గనిర్దేశం చేస్తుందన్నారు. భగవద్గీతను చదువుకుంటే మానసిక ప్రశాంతతో పాటు ఆత్మస్థైర్యం సిద్ధిస్తుం దన్నారు. తాను కూడా భగవద్గీతను అనుసరిస్తానని చెప్పారు. ప్రతి ఇంటా చిన్నారులు భగవద్గీత చదివేలా చూడాలని ఆమె తల్లితండ్రులకు సూచిస్తూ, భగవద్గీత తత్వాన్ని అందరూ ఆచరిం చేలా స్ఫూర్తిని కలిగించాలని ఆమె పిలుపు ఇచ్చారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చెప్పారంటే చేస్తారని, త్వరలోనే మందిరానికి స్థలం కేటాయింపు జరుగుతుందని తాను ఆశిస్తున్నట్లు ప్రకటించారు. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన దేవతామూర్తుల వేషధారణ, శ్లోక పఠనం, చిత్రలేఖనం వంటి పోటీల్లో గెలుపొందిన వారికి వేమిరెడ్డి దంపతులు, ప్రశంసాపత్రాలు, పతకాలను బహూక రించి ఆశీర్వదించారు. బీసీ నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం దంపతులు, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి దంపతులు, పిచ్చిరెడ్డి కళ్యాణ మండపం అధినేత చెరుకుపల్లి నారాయణరెడ్డి దంపతులు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని శ్రీకృష్ణభగవానునికి అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు.



# రామనారాయణతో..నారాయణ భేటీ

ఈనెల 18న అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పురపాలక, రాష్ట్ర పురపాలక..పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భేటీ అయ్యారు. మంత్రి ఆనం ఛాంబర్‌లో ఇరువురు మంత్రుల మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. నెల్లూరు జిల్లాకు సంబంధించిన రాజకీయ పరిస్థితులు, ప్రత్యర్థులకు ధీటుగా అనుసరించాల్సిన వ్యూహాలు, చేయాల్సిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై వారిద్దరూ చర్చించారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా ముందుకెళ్లాలని కూడా నిర్ణయించుకున్నారు.

# సూపర్ సిక్స్..సూపర్ సక్సెస్!

## సోమిరెడ్డి ఆధ్వర్యంలో 9 వందల ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ



రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయంటూ మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతలు ఆనందంతో విజయోత్సవం నిర్వహించారు. వ్యవసాయానికి మళ్ళీ పూర్వవైభవం వచ్చిందంటూ హర్షాతిరేకాలతో ఈనెల 19న మండల కేంద్రమైన వెంకటాచలంలో రైతు రథాలతో ర్యాలీ చేపట్టారు. అంచనాలకు మించి వచ్చిన వందలాది రైతు రథాలు (ట్రాక్టర్లు), రైతులతో కలిసి వెంకటాచలం ఇసుక డంపింగ్ యార్డు నుంచి ఎర్రగుంట సమీపంలోని కమ్యూనిటీ హాలు వరకు జాతీయ రహదారిపై జాతరలా సాగిన విజయోత్సవ యాత్ర రైతుల్లో ఉత్సాహం నింపింది. సోమిరెడ్డి మాట్లాడుతూ, వైకాపా హయాంలో మూతబడిన వ్యవసాయం, నీటిపారుదల రంగాలకు ఇప్పుడు జవసత్వాలొచ్చాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి రాష్ట్రంలో 93,000 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 'తల్లికి వందనం' కార్య క్రమంతో ఇంటింటా ఆనందం కలుగుతోందని, స్త్రీశక్తి పథకం మహిళల్లో ఊహించని స్థాయిలో సంతోషాన్ని నింపుతోందని ఆయన అన్నారు. ఈ పథకాలన్నీ చూశాకే పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. పీఎం కిసాన్ పథకంతో కేంద్రం రైతులకు రూ.6 వేలు ఇస్తుంటే, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరో రూ.14 వేలు కలిపి అందిస్తున్నారని, రైతులకు ఈ పథకాలు ఎంతో ప్రయోజనం కలిగిస్తున్నాయని ఆయన తెలిపారు.

# శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి అద్భుతం!

## 'కొరియా రిపబ్లిక్' కాన్సుల్ జనరల్ కితాబు



శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి అద్భుత మని, అక్కడి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ ఎంతో బాగుందని చెన్నైలోని కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్ కితాబిచ్చారు. పారిశ్రామిక రంగానికి శ్రీసిటీ స్ఫూర్తిదాయకంగా ఉం దంటూ మెచ్చుకున్నారు. కొరియా ట్రేడ్-ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కోట్రా) అధికారులు, కొరియన్ వ్యాపార ప్రతినిధుల బృందంతో కలిసి ఈనెల 19న ఆయన శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌తో సహా పలు కొరియన్ సంస్థలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దార్శనికతను కొనియాడుతూ, రాష్ట్రంలోని రవాణా వస తులు, నైపుణ్యత, వివిధ వ్యాపార ప్రయోజ నాలకు శ్రీసిటీ అద్దం పడుతుందన్నారు.

కాన్సుల్ జనరల్ పర్యటనపై స్పం దించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కొరియా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు ఈ పర్యటన ఎంతగానో సహకరిస్తుందని ఆకాంక్షించారు. 31 దేశాలకు చెందిన 240 కంపెనీలకు నిలయంగా అత్యంత విలువైన పెట్టుబడి గమ్యస్థానంగా శ్రీసిటీ మారిందని, ఈ ప్రస్థానంలో కొరియా పాత్ర ఎంతో ప్రాధాన్యతకలదిగా తెలిపారు. తొలుత, వారికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆప రేషన్స్) సతీష్ కామత్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బొడ్గన్ జార్జ్ స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలపై సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి విశ దీకరించారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌ను ఉదహ రిస్తూ, శ్రీసిటీలో అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక సరఫరా గొలుసు, పర్యావరణ వ్యవస్థల ప్రగతిని వివరించారు. ఈ పర్య టనలో భాగంగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, సోలెం పరిశ్రమ ప్రతినిధులతో కాన్సుల్ జనరల్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిం చారు. కొరియన్ సంస్థల సీఈఓలతో సమావేశమయ్యారు.

ఏదేమైనా, భారత్-కొరియా వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేయ డంలో శ్రీసిటీ తనవంతు కీలక పాత్రను పోషిస్తోందనడానికి ఇలాంటి సందర్శన లను ఒక నిదర్శనంగా చెప్పవచ్చు.




## శ్రీహరిరావుకు..
# 'ఇండియన్ పోలీస్ మెడల్'



విధి నిర్వహణలో అంకితభావంతో.. ఉత్తమ సేవలందిస్తున్న అధికారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున అమరావతిలో జరిగిన వేడుకల్లో సేవా పతకాలను బహుకరించారు. నెల్లూరుజిల్లాకు చెందిన శ్రీహరిరావుకు ఆ విశిష్టమైన అవార్డు లభించింది. నెల్లూరు విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న అక్కిశెట్టి శ్రీహరిరావుకు ముఖ్యమంత్రి 'ఇండియన్ పోలీస్ మెడల్'ను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని విజిలెన్స్-పోలీస్ అధికారులు, ఉద్యోగులు శ్రీహరి రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఓబీసీ జాతీయ సదస్సులో..
# బీఎంఆర్ కీలక సూచనలు




న్యూఢిల్లీలో ఈ నెల 19న జరిగిన జాతీయ వెనుకబడిన తరగతుల సదస్సులో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) కొన్ని కీలకమైన సూచనలు చేశారు. దేశంలోని అనేకమంది పార్లమెంట్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో వెనుకబడిన తరగతుల సామాజిక న్యాయం, సాధికారత, ప్రగతికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను చర్చించారు. బీఎంఆర్ మాట్లాడుతూ, దేశ జనాభాలో 52 శాతం మంది ఓబీసీలు ఉన్నప్పటికీ, వారికి ఇంకా పూర్తి న్యాయం జరగ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం పరిశీలించి, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా, చట్టసభల్లో ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, వారి సంక్షేమం కోసం కేంద్ర బడ్జెట్‌లో కనీసం లక్షకోట్లు రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో తీసుకున్న తీర్మానాలను త్వరలోనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన్ను పార్లమెంట్‌సభ్యులు, జాతీయస్థాయిలో వెనుకబడిన తరగతుల వారి కోసం పోరాడుతున్న పలువురు నాయకులు సన్మానించారు.

# నరేంద్రబాబు సేవలకు ప్రశంసలు



ఆగస్టు 15న నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్‌గా గుండాల నరేంద్రబాబు చేస్తున్న విశేష సేవలకు గుర్తింపు లభించింది. నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి, కార్పొరేషన్ కమిషనర్ నందన్‌లు ఆయనకు మెరిటోరియస్ సర్టి ఫికెట్‌ను బహుకరించి అభినందించారు. గతంలో నరేంద్రబాబు ఉభయ తెలుగురాష్ట్రాల ఎన్‌సిసి డైరెక్టరేట్ స్థాయిలో ఉత్తమ ఎన్‌సిసి అధికారిగా కూడా అవార్డునందుకున్నారు. కవిగా, రచయితగా కూడా ఆయన సాహితీరంగంలో తనకంటూ ప్రత్యే కతను సాధించుకున్నారు. ఆయనకు మెరిటోరియస్ సర్టిఫికెట్ లభించడం పట్ల స్థానిక కవులు, ఎన్‌సిసి అధికారులు సంతోషం వ్యక్తం చేస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

# పర్వతాల్లో ప్రకృతి ప్రకోపం




పశ్చిమ హిమాలయాల్లో ఆకస్మిక వరదలు తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఉరుములేని పిడుగు లాగా విరుచుకుపడి క్షణాల్లో తీవ్రమైన నష్టాన్ని కలగజేస్తున్నాయి. ఇటీవల కాలంలో ఉత్తరకాశి, ఉత్తరాఖండ్లోని ధరాలి, హిమాచల్ ప్రదేశ్‌లోని ఒకటి రెండు ప్రాంతాలు, జమ్మూ కాశ్మీర్లోని కిస్త్వార్, కతువా ప్రాంతాల్లో ఇటువంటి వరదలు సంభవించాయి. కొండ చరియలతో కూడిన బురద మట్టి ముంచెత్తి వందల సంఖ్యలో ప్రజలు మరణించారు. నివాసాలను బురద ముంచెత్తింది. ఈ ఆకస్మిక వరదలకు కారణం మేఘ విస్ఫోటాలు (క్లౌడ్ బరస్ట్లు) అని ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ హిమాని నదాలు కరగటం వల్ల కూడా ఆకస్మిక వరదలు సంభవించి ఉండవచ్చు అన్న వాదన కూడా వినిపిస్తోంది.

2025 ఆగస్టు 15న జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని చషోటి గ్రామాన్ని అకస్మాత్తుగా వరద ముంచెత్తింది. కానీ, కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియ లేదు. చషోటీలో జరిగినదాన్ని, ఉత్తరాఖండ్‌లోని ధరాలిలో జరిగిన ఇలాంటి ఆకస్మిక వరదతో పోలుస్తున్నారు. రెండూ పశ్చిమ హిమాలయాల్లోనే జరిగాయి. రెండింటికీ శాస్త్రీయంగా ఖచ్చితమైన వివరణ దొరకలేదు.

ధరాలి లేదా చషోటి వంటి ప్రాంతాల్లో వరదలు, దూరంలోని ఉపనదులలో అధిక వర్షం కురిసి, అది ఇరుకైన లోయలోకి చేరడం వల్ల కూడా సంభవించి ఉండవచ్చు అని కూడా భావిస్తున్నారు. శ్రీనగర్‌లోని వాతావరణ కేంద్రం అధికారిక గణాంకాల ప్రకారం ఆ రోజు కిష్త్వార్‌లో కేవలం 5 మిల్లీమీటర్ల వర్షమే పడింది. అంతకుముందు రోజు వర్షం లేదు. చషోటీలో వాతావరణ కేంద్రం లేకపోవడం వల్ల కీలకమైన డేటా నమోదు కాలేదు. చషోటి ఎగువ ప్రాంతాలు లడఖ్‌లోని జాన్స్కార్ ప్రాంతానికి కలుస్తాయి. అక్కడ ఏదైనా హిమనదం లేదా హిమనద సరస్సు తెగిపోవడం వల్ల ఆకస్మిక వరద వచ్చి ఉండవచ్చని ఒక అభిప్రాయం ఉంది. ఇలాంటి సిద్ధాంతమే ఉత్తరాఖండ్‌లో ధరాలి వరద తరువాత కూడా వచ్చింది. ఖీర్ గంగా పైనున్న హిమనద సరస్సు తెగిపోవడం వల్ల బురద కొట్టుకు వచ్చిందని భావించారు. కానీ వాడియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ శాస్త్రవేత్తలు, ఉపగ్రహ డేటాలో అలాంటి ఆధారాలు లేవని చెబుతున్నారు.

సాధారణంగా ఇటువంటి ఆకస్మిక వరదలు మేఘ విస్ఫోటాల వల్లనే విరుచుకు పడతాయని నిపుణులు చెబుతున్నారు. కానీ వాతావరణ కేంద్రాల రికార్డుల ప్రకారం అక్కడ అంత వర్షపాతం నమోదు కాలేదు. అందుకే ఈ విపరిణామం అంతు చిక్కకుండా ఉంది. మేఘ విస్ఫోటం అంటే ఒక పెద్ద పరిమాణంలో వర్షం చాలా తక్కువ సమయంలో పడడం. సాధారణంగా గంటలో 100 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువ వర్షపాతం, దాదాపు 30 చదరపు కి.మీ ప్రాంతంలో నమోదవుతుంది.

నెత్తి మీద ఒక్కసారిగా పెద్ద గంగాళంతో నీళ్లు కుమ్మరిచ్చినట్లు, ఆకాశం నుంచి ఎవరో నీళ్లు కుమ్మరిచ్చినట్లు వర్షం పడుతుంది. ఇది తీవ్ర విధ్వంసకరంగా ఉంటుంది. పర్వతాలు గాలులను అడ్డుకుని మేఘాలు ఎటూ పోలేక అక్కడే ఇరుక్కుపోయేలా చేస్తాయి. దీంతో మేఘాల్లో తేమ నిల్వ అవుతుంది. ఒక దశలో మేఘాలు తేమను దాచలేకపోయినప్పుడు అదంతా ఒకేసారి విడుదల అవుతుంది. వర్షం కుమ్మరిస్తుంది. భారత్, పాకిస్తాన్‌లో ఇటువంటి మేఘవిస్ఫోటాలకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. మేఘాలు, రుతుపవనాలు, పర్వతాలు - ఈ మూడూ మేఘ విస్ఫోటాలకు అనుకూలంగా ఉండే పరిస్థితులు. భారత్, పాకిస్తాన్‌లో ఇవన్నీ ఉన్నాయి. హిమాలయాలు, కరకోరం, హిందూకుష్ - ప్రపంచంలోనే ఎత్తైన పర్వత శ్రేణులు - ఇవన్నీ ఈ ప్రాంతాల్లో ఉన్నాయి.

వాతావరణం వేడెక్కడం వల్ల గాలి మరింత తేమను ఇముడ్చుకుంటోంది. అందువల్ల మేఘ విస్ఫోటాలు పెరుగుతున్నాయి.సాధారణంగా దక్షిణాసియాలో రెండు రుతుపవనాలు ఉంటాయి. ఒకటి జూన్-సెప్టెంబర్, మరొకటి అక్టోబర్-డిసెంబర్. కానీ గ్రీన్‌హౌస్ వాయువులు పెరగడం వల్ల ఇప్పుడు ఈ నమూనా మారింది. వాతావరణ మార్పులతో వేడి గాలి సముద్రాల నుండి (అరేబియా సముద్రం, భారత మహాసముద్రం) మరింత తేమను తీసుకుంటోంది. ఆ తేమ ఒక్కసారిగా వర్షంగా కురుస్తోంది. దీంతో రుతుపవనాల వల్ల క్రమబద్ధంగా కురవాల్సిన వర్షం కాకుండా, ఒక్కసారిగా వరదలు వస్తున్నాయి. 2013లో మేఘ విస్ఫోటాల వల్ల ఉత్తరాఖండ్లో 6,000 మందికి పైగా మరణించగా, 4,500 గ్రామాలు ప్రభావితమయ్యాయి.

మేఘ విస్ఫోటాలు భూకంపం సృష్టించే విధ్వంసానికి ఏమీ తీసిపోవు. భూకంపం ఎలాగైతే ముందుగానే పసిగట్టలేమో, మేఘ విస్ఫోటాలను కూడా ముందుగా అంచనా వేసే పరిస్థితి లేదు. ఇటువంటి ప్రకృతి విపరిణామాలు మానవాళికి కొత్త కాదు. అయితే ఒకప్పుడు ప్రకృతిని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా ఆవాస ప్రాంతాలు ఉండేవి కాబట్టి ఆస్తి ప్రాణ నష్టాలు తక్కువగా ఉండేవి. పైగా ఇప్పట్లాగా భూతాపం లేదు. మనిషి స్వయంకృతాపరాధంతో భూతాపం పెరిగి ఇటువంటి విపరిణామాలు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయి. పశ్చిమ హిమాలయాల్లో ప్రజల జీవనం, కొండలు లోయల్లోనే ఉంటుంది. అయితే ఒకప్పుడు వేల సంవత్సరాలుగా తరతరాల నుంచి అందిన అనుభవంతో జనావాసాలను వీలైనంతగా సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునేవారు. ఇప్పుడు ఎక్కడబడితే అక్కడ జనావాసాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రకృతి విపరిణామాలను తప్పించుకోలేకపోతున్నారు. ప్రకృతిశక్తి మానవశక్తి కంటే చాలా చాలా పెద్దది, గొప్పది. దాన్ని గౌరవించాలి. దానికి అను గుణంగా మనం ఉండాలి. ప్రకృతిని రక్షించాలి. అప్పుడే మనల్ని ప్రకృతి రక్షిస్తుంది. ప్రభుత్వం, నిపుణులు కూడా ఇటువంటి కొండ ప్రాంతాల్లో మేఘ విస్ఫోటాలకు, లేదా ఇతర కారణాల సంభవించే ఆకస్మిక వరదలకు కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి తగిన పరిష్కారాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## సంగంలో ఉపాధ్యాయుల నిరసన

మండల కేంద్రమైన సంగంలో డీఎస్‌సి-2003 టీచర్స్ ఫోరమ్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఇటీవల ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. సీపీఎస్‌ని రద్దు చేస్తూ, పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలంటూ నినాదాలు చేశారు. తమ కోర్కెల సాధనకు ఈనెల 25న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఆమేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

2004కి ముందు నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వపరంగా పాలనాపరమైన సమస్యల వల్ల నియామకాలు ఆలస్యమైన 2003 డీఎస్‌సి ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర శాఖల్లోని ఉద్యోగులందరికీ పాతపింఛన్ విధానాన్ని అమలుచేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. టీచర్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు బి.మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో సంగం మండలశాఖ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గాలి శివకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నెల్లూరులో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ఎన్నికల కమిషన్ తీరును తప్పుపడుతూ నెల్లూరులోని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఈనెల19న కొవ్వొత్తుల చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద జరిగిన ఈ ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, విపక్షాల వారు ప్రశ్నిస్తుంటే, ఎన్నికల కమిషనర్ సక్రమంగా స్పందించక పొంతనలేని విధంగా మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ అంశంలో రాహుల్‌గాంధీకి మద్దతుగా తాము ఆందోళనచేస్తూ, సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నా మన్నారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు అల్లా ఉద్దీన్, సుధీర్, రెహమాన్, మల్లికార్జునరెడ్డి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌మీటర్లపై సీపీఎం నిరసనలు

స్మార్ట్‌మీటర్ల వల్ల వినియోగదారులకు అదనపు భారం పడుతుందని, వెంటనే వాటి ఏర్పాటును రద్దుచేయాలని నినాదాలు చేస్తూ ఈనెల 19న నెల్లూరులోని 20, 21 డివిజన్లలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. తొలుత 20వ డివిజన్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ బయలుదేరింది. సబ్‌స్టేషన్ల వద్ద కొద్దిసేపు ధర్నాలు నిర్వహించిన అనంతరం విద్యుత్‌శాఖ అధికారులుకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. అదాని స్మార్ట్‌మీటర్లను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలగిస్తామని ఎన్నికలప్పుడు నాయకుడు చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక దాని అతీగతీ పట్టించుకోవడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం రూరల్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు, 20-21వ డివిజన్‌ల పార్టీ కార్యదర్శులు ఏ.శ్రీనివాసులు, సీహెచ్ రత్నం, పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నర్సుల ఆందోళన

నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈనెల 19న స్టాఫ్ నర్సులు ఆందోళన చేపట్టారు. మేల్ స్టాఫ్‌నర్సుపై కొందరు సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు ఈనెల18న దాడి చేయడం దారుణమని వారన్నారు. ఇలాంటి సంఘటనలతో తమలో అభద్రతాభావం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. బాధితుల పట్ల ఆసుపత్రి అధికారులు చులకనభావంతో ఉన్నారని వారు ఆరోపిస్తూ, ఈ సంఘటనపై న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ నర్సింగ్ అసోసియేషన్ నాయకురాలు మాధురి, పలువురు స్టాఫ్ నర్సులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# మహనీయుల త్యాగఫలం.. స్వాతంత్ర్యం

- గూడూరు ఎమ్మెల్యే పాశం



ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం వల్లే నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ నెల 15వ తేదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్‌కుమార్ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటారు.

గూడూరు కోర్టులో 7వ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్ ఆధ్వర్యంలో, సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో, గూడూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో, ఇంకా జనసేన కార్యాలయంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

# మేరిగ మురళీధర్‌కి ప్రముఖుల పరామర్శ



ఉమ్మడి నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరిగ మురళీధర్ తండ్రి ఆనందరావు ఆగస్టు 14వ తేదీ స్వర్గస్తులయ్యారు. ఆయన అంత్యక్రియలు 15వ తేదీ రాపూరు, లక్ష్మీపురంలోని మురళీధర్ నివాసంలో జరిగాయి. మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితర ప్రముఖులు ఆనందరావు మృతదేహానికి నివాళులు అర్పించి మేరిగ మురళీధర్‌రావుని పరామర్శించారు. మేరిగ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# డీజేలకు దూరంగా ఉండండి

డిఎస్పీ గీతాకుమారి



వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు డీజేలకు దూరంగా ఉండాలని గూడూరు డిఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఇటీవల ఆమె గూడూరు రెండో పట్టణ సీఐ, వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు, ఏఎస్ఐలతో కలిసి వినాయకచవితి ఉత్సవ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాహకులు డీజేలు, బాణాసంచాలకు దూరంగా ఉండాలని, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# గిద్దలూరు రమణయ్యకు అవార్డు



గూడూరు డివిజన్ విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షులు, చిల్లకూరు మండలం ముత్యాలపాడు విఆర్ఓ గిద్దలూరు రమణయ్య అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను అధికారుల మన్ననలు పొంది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారు.

# సీపీఐ మహాసభలు విజయవంతం చేయండి



ఆగస్టు 23వ తేదీన ప్రకాశం జిల్లా, ఒంగోలులో నిర్వహించే సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు ప్రభాకర్ కోరారు. గూడూరు పట్టణంలోని కార్యాలయంలో ఇటీవల ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. నాయకులు శశికుమార్, కుమార్, రమేష్, రాజా, చెంచు రామయ్య తదితరులు పాల్గొన్నారు.



# నేత్రపర్వంగా శ్రీకృష్ణుని శోభాయాత్ర

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలో ఈనెల 18వతేదీ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. గోపూజ, గణపతి పూజ, శ్రీకృష్ణ భగవానుని పూజ, వివిధ పాఠశాలల విద్యార్థినీవిద్యార్థుల గోపిక శ్రీకృష్ణుల వేషధారణలతో పురవీధుల్లో శోభాయాత్ర నయనానందకరంగా సాగింది. డివిఆర్ హాలులో నృత్యపోటీలు నిర్వహించారు. అనంతరం 'లాయర్' వార్తాపత్రిక గూడూరు ఇన్‌ఛార్జ్, బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ తదితరుల చేతులమీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ శోభాయాత్రలు జరుపుతున్నట్లు తెలిపారు. వెంకటరమణయ్య, రావూరు రవిచంద్రారెడ్డి, కడివేటి రామ్మూర్తి, వాకా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ గోశాలలో గోమాత రక్ష



చిల్లకూరులోని, వరగలి క్రాస్‌రోడ్డు వద్దగల శ్రీకృష్ణ గోశాలలో ఆగస్టు 16వ తేదీ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోమాత రక్ష వేడుకలు గోశాల ట్రస్టు ఛైర్మెన్ బుడిదవాక వెంకటరత్నమాచారి – ప్రభావతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గోమాత పూజను ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ భక్తులు భారీగా పాల్గొన్నారు.

# గూడూరును జిల్లాగా ప్రకటించాలి

గూడూరును జిల్లాగా ప్రకటించాలంటూ ఇటీవల గూడూరు జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమితి సభ్యులు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ని కలిసి ఆమేరకు వినతిపత్రాన్ని సమర్పించారు.

---

# రైల్లోంచి జారిపడి... ప్రాణాలు కోల్పోయారు!

- వేర్వేరు ఘటనల్లో నలుగురు దుర్మరణం
- నెల్లూరు వద్ద ఇద్దరు స్నేహితులు మృతి
- మరో ఘటనలో హెల్త్ అసిస్టెంట్ కన్నుమూత

*రైళ్ళల ప్రయాణిస్తునప్పుడు జాగ్రత్తగా ఉండాలని రైల్వేశాఖ వారు ఎంతగా చెప్తున్నా, కొంతమంది పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రాణాలకే ముప్పు తెచ్చుకుంటున్నారు. ఇటీవల నెల్లూరుజిల్లాలో జరిగిన వేర్వేరు సంఘటనల్లో రైళ్లలోంచి ప్రమాదవశాత్తూ జారి కిందపడి, వేర్వేరు ఘటనల్లో నలుగురు దుర్మరణం పాలయ్యారు. వారిలో ఇద్దరు స్నేహితులు మరణించడంతో, వారి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాగా స్నేహంగా ఉన్న వారిద్దరూ విజయవాడకు రైలులో వెళ్తూ, మార్గమధ్యంలో మృత్యువు పాలయ్యారు. బోగీలోని తలుపు వద్ద కూర్చుని మాట్లాడుకుంటుండగా పొరపాటున జారి పడడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. అదేవిధంగా ఈనెల 18న నెల్లూరుజిల్లా తలమంచి–కొడవలూరు రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్లోంచి జారిపడి కోవూరుపల్లి హెల్త్‌అసిస్టెంట్ మరణించాడు. మరో ఘటనలో ఒక గుర్తుతెలియని వ్యక్తి కావలి సమీపంలో రైలు నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. వివరాలిలా ఉన్నాయి.*





గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పోలయ్య(24), అర్షద్(19), వెంకటేష్‌లు తమ స్నేహితుడి తమ్ముడి కుమార్తె ఫంక్షన్ కోసమని ఈనెల 14న రైలులో విజయవాడకి బయలుదేరారు. వెంకటేష్ బోగీలోపలకి వెళ్ళి కూర్చోగా, పోలయ్య, అర్షద్‌లు సరదాగా మాట్లాడుకుంటూ వెళ్ళి, బోగీలోని తలుపు వద్ద కూర్చున్నారు. వారలా మాట్లాడుకుంటూ ఉండగానే రైలు వేగంగా నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్దకు రాగానే, వీరిద్దరూ పొరపాటున జారి కిందపడిపోయారు. బోగీలోపల కూర్చున్న వెంకటేష్, రైలు స్టేషన్ వద్దకు చేరుకోగానే ఇద్దరు మిత్రుల కోసం చూస్తే, వారు కనిపించలేదు. ఎక్కడ వెతికినా కనిపించలేదు. వెంటనే చెన్నూరుకు వెళ్ళి, వాళ్లిద్దరూ కనిపించలేదని వారి కుటుంబసభ్యులకు చెప్పడంతో, అందరూ ఆందోళనతో వారి ఆచూకీ కోసం గాలింపు ప్రారంభించారు. అయినా, కనిపించకపోయేసరికి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు రంగంలోకి దిగి, వెతకడం ప్రారంభించారు. కొండాయపాళెం గేటు సమీపంలోని రైలుపట్టాలపై నుజ్జునుజ్జయి ఉన్న ఒక మృతదేహాన్ని రైల్వే పోలీసులు కనుగొన్నారు. ఆ మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి చేర్చారు. మరుసటి రోజున గాలింపులో, కొండాయపాళెం పరిసరాల్లోనే ముళ్ళకంపల్లో పడివున్న మరో మృతదేహాన్ని కూడా చూసి, కుటుంబ సభ్యులకు తెలపగా, వాళ్లిద్దరినీ పోలయ్య, అర్షద్‌లుగా గుర్తించారు. శుభకార్యానికి వెళ్లొస్తామని చెప్పి బయలుదేరిన ఇద్దరూ శవాలుగా కనిపించడంతో వారి కుటుంబ సభ్యుల పెద్దపెట్టున రోదించారు. మృత దేహాలను పోస్టుమార్టంకు తరలించి, నెల్లూరు రైల్వే ఎస్ఐ హరిచందన ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కావలి రైల్వేస్టేషన్ పరిధిలో మరొకరి మరణం :



చెన్నై నుంచి హౌరా వెళ్తున్న మరో వ్యక్తి అదేవిధంగా కావలి సమీపంలో ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి మరణించినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. కావలి రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిగా నమోదు చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆ వ్యక్తి బ్లూ కలర్ ప్యాంట్, తెలుపురంగు ఫుల్‌షర్ట్ వేసుకుని ఉన్నాడని, కావలిలోని మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామని, మృతుని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు. కావలి రైల్వే ఎస్ఐ కె.వెంకట్రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


### హెల్త్ అసిస్టెంట్ మృతి



రైల్లోంచి ప్రమాదవశాత్తూ జారి పడి కోవూరుపల్లి హెల్త్ అసిస్టెంట్ ఎన్.రామ్‌కుమార్ మృతిచెందాడు. ఈనెల 18న నెల్లూరుజిల్లాలోని తలమంచి–కొడవలూరు రైల్వేస్టేషన్ల మధ్య ఈ దుర్ఘటన జరిగింది. బోగోలు మండలంలోని కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సహాయకునిగా రామ్‌కుమార్ పనిచేస్తున్నాడు. సోమవారం నెల్లూరుకు వెళ్లేందుకు రైలెక్కాడు. కొడవలూరు–తలమంచి రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్లోంచి జారిపడడంతో దుర్మరణం పాలైనట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

# కళ్యాణ వైభవం...!

## మహేశ్వర్ - నేత్రిక



నెల్లూరు వాస్తవ్యులు కే.విజయ భాస్కర్‌రెడ్డి - అరవిందరెడ్డిల కుమారుడు **దుర్గా మహేశ్వర్‌రెడ్డి - సాయి నేత్రికారెడ్డి** (ఎస్.గోవర్ధన్‌రెడ్డి - డా. బి.ఆర్.శైలజల కుమార్తె)ల పరిణయం ఆగస్టు 14వ తేదీ తిరుమలలో ఘనంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభ దీవెనెలు.

## సుయాష్ - నవ్య



మాజీ శాసనసభ్యులు, జిల్లాలో సీనియర్ రాజకీయవేత్త సి.వి.శేషారెడ్డి - శ్రీమతి లీలావతమ్మల మనుమడు, ఎల్లసిరి సుభాష్‌రెడ్డి - శ్రీమతి మంజులల కుమారుడు **సుయాష్ - నవ్య** (బెంగుళూరు వాస్తవ్యులు వలసారెడ్డి విజయభాస్కర్‌రెడ్డి - శ్రీమతి రాధల కుమార్తె)ల పెళ్లి ఆగస్టు 14వ తేదీ బెంగళూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.



## షణ్ముఖ - ఆదిత్య



ఇందుకూరుపేట వాస్తవ్యులు బట్టేపాటి సురేష్‌నాయుడు - అమరావతిల కుమార్తె **షణ్ముఖ ప్రియ - సాయి సత్య ఆదిత్య** (కాకినాడ వాస్తవ్యులు దేవళ్ళ వెంకటరామమ్ - విశాలాక్షిల కుమారుడు)ల వివాహం ఆగస్టు 13వ తేదీ రాత్రి నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# ఉప రాష్ట్రపతి అభ్యర్థితో విపిఆర్



ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 18న ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పలువురు ఎంపీలతో కలసి విపిఆర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడుకు సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. అంతకు ముందు జార్ఖండ్ గవర్నర్‌గా కూడా సేవలందించారు. ఆ సమయంలో తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహించారు. బీజేపీ నేతలు రాధాకృష్ణన్‌ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిర్ణయించిన నేపథ్యంలో, ఎన్డీఏ నాయకులు, కూటమి ఎంపీలు ఆయనకు శుభాభినందనలు తెలిపారు.

# 'మట్టిలో మాణిక్యాలను' వెలికితీస్తాం

**• మంత్రి నారాయణ**



సరైన విద్యాప్రోత్సాహం లేక జిల్లాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన విద్యార్థులు బడులకు దూరంగానే ఉంటున్నారని, అలాంటి మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారికి కార్పొరేట్ తరహాలో విద్యను అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు- 9వ డివిజన్‌లోని చిన్న బాలయ్య పాఠశాల, 14వ డివిజన్‌లోని మల్లెల సంజీవయ్య పాఠశాల, 45వ డివిజన్లోని నగరపాలక ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు నగరంలోని 15 ఉన్నత పాఠశాలలను విఆర్ హైస్కూల్ తరహాలోనే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే జూన్ మాసం నాటికి నగరంలోని 15 ఉన్నత పాఠశాలలను అన్ని హంగులతో పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పి-4 విధానంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం అనుసరించి నర్సరీ నుండి 12వ తరగతి వరకు ఒకే ప్రదేశంలో పాఠశాలలు ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఇందుకోసం ప్రతి స్కూల్లో 40 గదులు అవసరమన్నారు. త్వరలోనే ఎస్టిమేట్స్ తయారు చేయించాలని ఆదేశించామన్నారు. అదేవిధంగా నెల్లూరు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. నగర ప్రజలకు మంచినీటి సౌకర్యంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. నగరంలోని అల్లీపురం, దొంతాలి తదితర ప్రాంతాలలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను రాబోయే కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్‌తో పాటు టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీలు, కేంద్రమంత్రులతో.. లోకేష్ చర్చలు

**• పాల్గొన్న మన ఎంపీలు**



రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కేంద్ర మంత్రులతో చర్చించేందుకు ఈనెల 18న ఢిల్లీకి వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 10.40 వరకు పలువురు కేంద్రమంత్రులను కలసి, రాష్ట్రానికి ఆర్థిక చేయూతనివ్వాలని కోరారు. తొలుత, టీడీపీ కార్యాలయంలో పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర ఎంపీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధుల విషయమై చర్చించారు. అనంతరం, ఎంపీల బృందంతో కలసి లోకేష్ కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, ఎరువులు రసాయనాల మంత్రి జేపీ నడ్డా, కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీలను కలిశారు. జల రవాణాశాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌తో, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లతో మాట్లాడారు. ఆ తర్వాత ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వానికి కేంద్రం చేస్తున్న సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని ఆర్థికమంత్రికి వివరించి, కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించాలని కోరారు. తొలుత, టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు లోకేష్‌ను ఘనంగా సన్మానించారు.

# రాష్ట్ర పురోభివృద్ధే.. ప్రభుత్వ ధ్యేయం



రాష్ట్రంలో పారదర్శకతతో కూడిన సుపరిపాలన అందిస్తూ, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నూతన విధానాలను అనుసరిస్తూ రాష్ట్ర పురోభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న నెల్లూరులోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌లతో కలసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం, శాంతి కపోతాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ డాక్యుమెంట్లను తయారుచేశామని, దీనికనుగుణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. అనంతరం జిల్లాలో శాఖల వారీగా ప్రగతి నివేదికను వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో లక్షా 35వేల ఎకరాల్లో పంటలు సాగుచేసినట్లు చెప్పారు. 78 టిఎంసిల నిల్వ సామర్థ్యం గల సోమశిల రిజర్వాయరు కింద 2025-26 ఖరీఫ్ పంటకు 40.44 టీఎంసిల నీటి వినియోగంతో 3 లక్షల 64వేల ఎకరాలకు, కండలేరు జలాశయం నుంచి 16టిఎంసిల నీటి వినియోగంతో 1.60లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. సోమశిల ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.3.87 కోట్లు మంజూరై పనులు టెండరు దశలో వున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, జడ్పీ ఛైర్‌ఫర్సన్ అనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్ పి.కృష్ణయ్య, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీవోలు అనూష, పావని తదితరులు పాల్గొని స్వాతంత్ర్యవేడుకలను తిలకించారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు :**

పోలీసు కవాతు మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు దేశభక్తి ఉప్పొంగేలా సాగాయి. కోవూరు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, నెల్లూరు ఎస్ఆర్‌కె నెక్ట్స్ జనరేషన్ హైస్కూల్, కావలి గిరిజన సంక్షేమ గురుకులపాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడిని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ, భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కొనియాడుతూ కోవూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థినులు ప్రదర్శించిన రూపకం అందరి ప్రశంసలందుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

**ఆకట్టుకున్న శకటాలు :**

శకటాల పోటీలలో విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖకు ప్రథమస్థానం లభించింది. నెల్లూరు నగరపాలకసంస్థ శకటానికి ద్వితీయస్థానం, వ్యవసాయ అనుబంధశాఖల శకటాలకు తృతీయ స్థానం లభించాయి. ఆయా శాఖల అధికారులకు, సిబ్బందికి మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్ జ్ఞాపికలను అందజేశారు.

## మహనీయుల త్యాగాలను గుర్తుంచుకోవాలి

### జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు వారి ప్రాణాలను సైతం త్యాగం చేశారని, అలాంటి వారి త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఇప్పుడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాలన్నీ ఆ మహనీయులు ప్రసాదించినవేనని, వాటిని పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అనీ చెప్పారు. ఆగస్టు 15న నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఆమె జాతీయజెండాని ఎగురవేసి, అదే ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. దేశభక్తితో రాణిస్తూ, అందరూ దేశ ప్రగతికి కృషిచేయాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రజలకు తమవంతు సేవలందించాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఇఓ మోహన్ రావు, జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కందలపాడులో ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం మండలంలోని కందలపాడు గ్రామంలో ఈ నెల 19న ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మూగజీవాల వ్యాధుల నివారణకు తగు మందులు పంపిణీ చేశారు. మండవ ఫౌండేషన్ పశు వైద్యాధికారి డాక్టర్ వి.శ్రీనివాసులునాయుడు, కనుపూరు పశువైద్యశాఖాధికారి డాక్టర్ మంజునాథ్‌సింగ్ పశువులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేశారు. వీరితోపాటు పశువైద్య సహాయకుడు సుబ్బయ్య, నితీషా, శ్రావణ్‌కుమార్, సుధీర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



• జిల్లా జడ్జి..ఆదర్శం

## రక్తదానం చేసిన ప్రధాన న్యాయమూర్తి

రక్తదానం చేస్తే రోగులు లేదా బాధితుల ప్రాణం కాపాడినట్లే కనుక, ఎందరో రక్త దాతలు ఆ అసహాయులకు అవసరమైనప్పుడల్లా రక్తదానం చేస్తుంటారు. అధికారులు కూడా ఈ మానవీయ సేవా కార్యక్రమాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తుంటారు కూడా. అయితే, సాధారణంగా జిల్లాస్థాయి ఉన్నతాధికారుల వంటి వారు రక్తదానం చేయడం అరుదుగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం రోజున నెల్లూరుజిల్లా జడ్జి జి.శ్రీనివాస్ స్వయంగా రక్తదానం చేసి అందరికీ మార్గదర్శకులయ్యారు. రెడ్‌క్రాస్ సహకారంతో జిల్లా కోర్టులో న్యాయవాదుల ఉద్యోగం సంఘం అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, కోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఎగరేసిన అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆ శిబిరాన్ని సందర్శించారు. సమాజానికి ఎంతో ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఆ సంఘం అధ్యక్షుడు పీవీ రమణారెడ్డిని అభినందించారు. అంతేకాదు, మిగిలిన దాతలతో పాటు స్వయంగా జిల్లా జడ్జి కూడా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. దీంతో న్యాయవాద వర్గాలే కాక, స్థానిక ప్రజలు కూడా జిల్లా ప్రధానన్యాయమూర్తి మానవీయ సేవకి సంతోషం వ్యక్తం చేశారు. నగరంలోని పలు కోర్టుల న్యాయవాదులు, ఉద్యోగ సంఘం ప్రతినిధులు, కోర్టు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## దేశభక్తి గీతాలతో ఆకట్టుకున్న ధ్రువ కుమార్

స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నెల్లూరు దర్గామిట్ట సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 1వ తరగతి చదువుతున్న ధ్రువకుమార్‌రాజ్ దేశభక్తి గీతాలు పాడి చిన్నారుల్లో ఉత్సాహం కలిగించాడు. గతంలో కూడా దేశభక్తి, దైవభక్తి గీతాలు పాడి జిల్లా ఉన్నతాధికారుల నుంచి ధ్రువ అభినందనలు అందుకున్నాడంటూ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లూవిజ ఆ బాలుడి ప్రతిభను అభినందించారు.

## టూకీగా...

### పడమటి కంభంపాడులో ఆర్డీఓ పర్యటన

అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామంలోని ఓ ఎస్టీకాలనీని ఈనెల 19న ఆత్మకూరు ఆర్టీఓ పావని సందర్శించారు. తహశీల్దార్ జనార్ధన్‌తో కలసి పర్యటించి, ఎస్టీల సమస్యలను తెలుసుకున్నారు. గిరిజనులు తమ కాలనీకి రోడ్డు, విద్యుత్ సదుపాయాలు కావాలని చెప్పగా, ఆ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

### దాచూరులో రైతులకు అవగాహన

కలువాయి మండలంలోని దాచూరు రైతు సేవాకేంద్రంలో ఈనెల 19న మండల వ్యవసాయాధికారి కళారాణి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలతో మెళకువలు పాటించాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే పంటల నమోదు తప్పనిసరి అని చెప్పారు.

### నందిపాడులో సరస్వతి విగ్రహాన్ని బాగుచేయండి

దుత్తలూరు మండలం నందిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో దాతలు నిర్మించిన సరస్వతీదేవి విగ్రహం కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుందని, రంగులు వెలిసిపోయి, సిమెంట్ ఊడిపోతోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. రూపు కోల్పోతున్న ఆ విగ్రహాన్ని వెంటనే బాగుచేయించాలని వారు దాతలను కోరుతున్నారు.

### కోవూరు వీరాంజనేయస్వామికి పల్లకిసేవ

కోవూరులో కొలువైవున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 19న శ్రావణమాస పూజలు కన్నులపండువగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు చేశారు. నాగవల్లి పత్రాలతో అర్చించి, అనంతరం పల్లకిసేవ నిర్వహించారు.

### భైరవరంలో మద్యం సీసాలు స్వాధీనం

దుత్తలూరు మండలంలోని భైరవరం గ్రామంలో ఈనెల 19న ఉదయగిరి ఎక్సైజ్ సీఐ దీప్తికరంత్ తన సిబ్బందితో దాడులు చేసి గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ దాడుల్లో ఒక దుకాణదారునిపై కేసు నమోదు చేసి, ఆ వ్యక్తి వద్ద నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

### కోవూరులో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

కోవూరు మండలంలో జరుగుతున్న గృహనిర్మాణాల స్థితిగతులను ఈనెల 19న ఆ శాఖ ఇన్‌చార్జి డీఇ వెంకటేశ్వర్లురెడ్డి సమీక్షించారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన, పేదల గృహనిర్మాణాలను సత్వరం పూర్తిచేయించాలన్నారు. సమస్యలేమైనా ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### సోమశిలలో చేపపిల్లల ఉత్పత్తికేంద్రం పరిశీలన

సోమశిలలో జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మత్స్యశాఖ అధికారి సురేష్ ఈనెల 19న పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ఈ కేంద్రాన్ని బాగుచేయించి ప్రారంభించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని సిబ్బందికి తెలిపారు. ఉత్పత్తి చేసిన చేపపిల్లలను ఈ ఏడాది చివరలో సోమశిల జలాశయంలో వదులుతామన్నారు.

### కండలేరుకు వరద నీరు

ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల రాపూరు మండలంలోని కండలేరు జలాశయానికి వరద నీటి ప్రవాహం వస్తోంది. ఈనెల 19 నాటికి కండలేరులో 28.990 టీఎంసీల నీరు నిల్వ ఉందని, సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 7,280 క్యూసెక్కుల నీరు చేరుతోంది.

### బట్టేపాడులో కౌలురైతుల సమావేశం

ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామంలో ఈనెల 19న కౌలురైతుల సమావేశం జరిగింది. తమకు ప్రభుత్వం నుంచి రాయితీలు రావడం లేదని, వస్తాయన్న గ్యారెంటీ కూడా లేదని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘాల నాయకుల వద్ద వారు తమ గోడు వినిపించారు. ఐక్యంగా ఉండి సమస్యలు సాధించుకోవాలని నాయకులు వారికి చెప్పారు.



# ప్రశాంతమ్మ చొరవతో జాబ్‌మేళా

## • 110 మందికి ఉద్యోగాలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ఇటీవల కోవూరులో నిర్వహించిన జాబ్‌మేళా 110మంది నిరుద్యోగుల జీవితాలకు వెలుగుబాటలు వేసింది. కోవూరు వైకెకెఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రారంభించగా, కోవూరు నియోజకవర్గ పరిధిలోని వందలాదిమంది యువతీయువకులు హాజరుకావడం విశేషం. ఈ జాబ్‌మేళాలో పాల్గొన్న ఐటీ, ఫార్మా, మార్కెటింగ్ కంపెనీ ప్రతినిధులు 110మంది యువతను ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. వారికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉద్యోగ నియామక పత్రాలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, యువత తమ ప్రతిభను పారిశ్రామిక సంస్థలవారికి పరిచయం చేసుకునేందుకు జాబ్‌మేళాలు దోహద పడతాయన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనడం ద్వారా కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణ, కెరీర్ గైడెన్స్ లాంటి అదనపు అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఇంటర్వ్యూ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు అభ్యర్థులు నేర్పు ఓర్పులతో సమాధానాలు చెప్పాలని ఆమె యువతకు సూచించారు. ఆశించిన జాబ్ రాకపోయినంత మాత్రాన నిరాశ పడాల్సిన అవసరం లేదని, మరెన్నో అవకాశాలు కూడా వస్తాయని భరోసా ఇచ్చారు. చదువుకొని నిరుద్యోగులుగా వుండడం కన్నా. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం మంచిదన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు మరియు సేవా రంగాలలో యువతకు ఎన్నో కొత్త అవకాశాలు వస్తున్నాయని, ఏ రంగంలో అయినా విజయం అనేది ఒక్క రోజులో సాధించేది కాదన్నారు. యువతలోని సామర్థ్యాన్ని గుర్తించి వారికి అవకాశాలు కల్పించాలని ఉద్యోగార్థుల కోసం విచ్చేసిన కంపెనీల ప్రతినిధులకు ఆమె సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ యువత ఉపాధి కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. జాబ్ మేళాలో పాల్గొన్న యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలను, తమ కలలను సాకారం చేసుకోవాలని ఆశీర్వదించారు. తమకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషిచేసిన ప్రశాంతమ్మకు ఉద్యోగాలు పొందినవారంతా తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యుమ్, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## • విడుదలైన కాకాణి

# బెయిలుపై బయటకి!



అక్రమ మైనింగ్ ఆరోపణలతో పాటు మరికొన్ని కేసులతో 86 రోజుల పాటు జైలు జీవితం గడిపిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఉదయం 10.20 నిముషాలకి బెయిలుపై జైలు నుండి బయటకి వచ్చారు. నిజానికి ఆయన మంగళవారమే విడుదల కావలసి ఉండగా, బెయిలుకి సంబంధించిన పత్రాలు ఆలస్యంగా అందడంతో విడుదల బుధవారానికి వాయిదా పడింది.

భారీ శ్రేణిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు జైలు వద్దకి చేరుకుని కాకాణికి స్వాగతం పలికారు. బయటకి రాగానే కాకాణి తన సహజ నైజాన్ని ప్రదర్శించారు. కూటమిపై విరుచుకుపడ్డారు. జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా, రెండుసార్లు శాసనసభ్యుడిగా, మంత్రిగా పనిచేసిన తనని ఇన్ని రోజులు జైల్లో పెట్టడం చంద్రబాబు పోకడకు అద్దం పడుతోందన్నారు. జైల్లో అందరూ వైసీపీ వారే వున్నారని, బాబు పుణ్యం 86 రోజుల పాటు వారందరితో గడిపే అవకాశం తనకి లభించిందని అన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని, ఆయన కుమారుడిని వదిలిపెట్టనని, వారిని వెంటాడి వారి అక్రమాలని, అరాచకాలని బయటపెడతానని కాకాణి శపథం చేశారు. నెల్లూరుజిల్లాలో ఉండకూడదన్న కోర్టు ఆదేశాన్ని అనుసరించి గోవర్ధన్‌రెడ్డి జైలు నుండి నేరుగా తన తాడేపల్లి నివాసానికి వెళ్లిపోయారు. ప్రస్తుత నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా ప్రస్తుత అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కాకాణి కుమార్తె పూజిత తదితరులతో తాడేపల్లిలో కాకాణి భేటీ అయ్యారు.

## నెల్లూరులో ఉచిత బస్సులకు..

# 'రైట్.. రైట్'



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులు ప్రవేశపెట్టడంతో మహిళా లోకంలో సంతోషం వెల్లువెత్తుతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకం మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర పుర పాలక మంత్రి డా. నారాయణ చెప్పారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్‌లతో కలసి మంత్రి ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన బస్సులను జెండా ఊపి ప్రారంభించి, అదే బస్సులలో ర్యాలీగా నవాబ్‌పేట వరకు ప్రయాణించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రానికి 10 లక్షల కోట్ల అప్పు మిగిలించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా 1900కోట్లు వ్యయం అవుతుందని, అయినప్పటికీ మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషితో ఆ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. నెల్లూరుజిల్లాలో సరాసరిన ప్రతిరోజు 61 వేలమంది మహిళలు ప్రయాణాలు చేస్తుంటారని, ఈ పథకం అమలు ద్వారా మహిళా ప్రయాణికుల సంఖ్య లక్షకు చేరుతుందని ఆయన తెలిపారు. ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సురేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఎంఆర్‌కి.. సముచిత స్థానం



## • రెండు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యత్వం

నెల్లూరుజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు(బీఎంఆర్)కి జాతీయస్థాయిలో సముచిత స్థానం లభిస్తోంది. తాజాగా ఇటీవల ఆయనకు ఏకకాలంలో రెండు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలలో సభ్యత్వం లభించడం విశేషం. 2025 –26 సంవత్సరానికి గ్రామీణాభివృద్ధి, పంచాయతి రాజ్ స్థాయీ కమిటీల అభ్యున్నతి కోసం ఏర్పాటుచేసిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల్లో సభ్యునిగా, అదే విధంగా వ్యవసాయం, పశుసంవర్ధకం, ఆహార ప్రాసెసింగ్ కమిటీల్లోనూ సభ్యునిగా కూడా ఆయన్ను నియమిస్తూ ఈనెల 18వ తేదీన లోక్‌సెభ సెక్రటేరియ్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ ఇటువంటి ముఖ్యమైన కమిటీలలో తనకు అవకాశం కల్పించినందుకు ప్రధాని నరేంద్రమోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. తనకు కేటాయించిన బాధ్యతల మేరకు పేదరిక నిర్మూలన, గ్రామీణ ఉపాధి, పంచాయతీల బలోపేతం, రైతుల ఆదాయ వృద్ధి, పశుసంవర్ధక, మత్స్యరంగం, ఆహార ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

# డా. గంగిశెట్టికి 'కీర్తి పురస్కారం'



నెల్లూరుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్‌కి తెలుగు విశ్వవిద్యాలయం వారి 'కీర్తి పురస్కారం' లభించింది. బాలసాహిత్యంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు వచ్చింది. ఈ ఏడాది తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు మొత్తం 48 మంది ఎంపిక కాగా, వారిలో నెల్లూరుజిల్లాకి చెందిన డా. గంగిశెట్టి ఒకరు కావడం విశేషం. ఇటీవలే బాలసాహిత్యంలో ఆయనకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు కూడా లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాదు, నాంపల్లిలోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో త్వరలో జరుగనున్న కార్యక్రమంలో డా.గంగిశెట్టికి కీర్తి పురస్కారంతో పాటు 5,116 రూపాయలను బహుకరించి ఘనంగా సన్మానించనున్నారు.



# ఎర్ర చందనం స్వాధీనం

నెల్లూరుజిల్లా కావలి ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ నెల 19వతేదీ రాత్రి వాహనాలు తనిఖీలు చేస్తుండగా సుమారు 2కోట్ల రూపాయల విలువచేసే ఎర్రచందనం పట్టుబడింది. కొండబిట్రగుంట అటవీ ప్రాంతంలో వేగంగావస్తున్న రెండు కార్లను వెంబడించి మొత్తం 83 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఏపీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

# భరతనాట్య కళాకారిణి.. నళిని ఆరంగేట్రం 23న



అమెరికాలో ఉంటున్న నెల్లూరీయురాలు, ప్రముఖ భరతనాట్య కళాకారిణి నళినీ ముకుందల గుంటూరి..ఈనెల 23న నెల్లూరు టౌన్‌హాలులో భరతనాట్యం ఆరంగేట్రం చేయనున్నారు. నెల్లూరు నగర నివాసిని అయిన ఆమె, కుటుంబంతో సహా కొంతకాలం క్రితం అమెరికాలో స్థిరపడ్డారు. అయినా నాట్యం మీద ఆసక్తితో తన 37వ ఏటా అమెరికాలో ప్రసిద్ధ నాట్యగురువు శరణ్యాగణేశన్ వద్ద భరతనాట్యం నేర్చుకుని అక్కడ పలు ప్రదర్శనలిచ్చారు. తన స్వస్థలమైన నెల్లూరుపై ఉన్న మమకారంతో ఇక్కడ ప్రదర్శన ఇవ్వాలనే సంకల్పంతో ఆమె ఈనెల 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచీ భరతనాట్యం ప్రదర్శించబోతున్నారని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఆమె నాట్యానికి సహకారంగా నట్టువాంగం విద్వాంసులు డేగల సాంబశివరావు, కుమారి మల్లాది అనూష గాత్ర సహకారం, వయెలనిస్టు మద్దెల లోకేష్‌బాబు, మృదంగంపై ఆర్ఎం ఈశ్వర్‌సాయ్ వాద్య సహకారం అందించనున్నారని వారు తెలియజేశారు. నాట్య కళాకారులు, నాట్యాభిమానులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com